

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

# ఘట్‌కేసర్-ఖాజీపేట్‌ల మధ్య రైల్వేలైన్‌కు క్లియర్

## నేడు ఘట్‌కేసర్‌లో పిఎం మోడీకి క్షీరాభిషేకం

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్నామని డివిజన్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఘట్‌కేసర్-ఖాజీపేట్‌ల మధ్య 4వ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలుపడం హర్షదాయకమని ఆయన పేర్కొన్నారు. ఘట్‌కేసర్ వరకు ఎంఎంటిఎస్ లైను ఉందని ఇక్కడి నుంచి దాదాపు 110 కిలోమీటర్ల మేర నాలుగో లైన్ నిర్మాణానికి రూ.2,419 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ అభివృద్ధికి, రైల్వే మౌలిక సదుపాయాల బలోపేతానికి ఘట్‌కేసర్-ఖాజీపేట్ లైన్ వేయాలని నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృతజ్ఞతగా గురువారం ఉదయం 9:30 గంటలకు ఘట్‌కేసర్ అంబేద్కర్ చౌరస్తాలో క్షీరాభిషేకం నిర్వహిస్తున్నామని బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని మహిపాల్‌రెడ్డి కోరారు.





తాసీల్దార్ ముందు మొరపెట్టుకుంటున్న బాధితులు

# ఒకరి చెక్కు... మరొకరి ఖాతాలోకి!

## తాసీల్దార్ సిబ్బంది నిర్వాకం

### కల్యాణలక్ష్మిలో తీవ్ర గందరగోళం

**పెద్దేముల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండల తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది నిరక్ష ్యం కారణంగా కల్యా ణలక్ష్మి ్మ పథకం పంపిణీలో తీవ్ర గందరగోళం నెలకొంది. ఒకరికి మంజూరైన చెక్కు పొరపాటున మరో లబ్ధిదారుడి ఖాతా లోకి వెళ్లడంతో అసలైన లబ్ధిదారులు తీవ్ర అన్యాయానికి గుర య్యారు.

**స్థానిక అధికారుల చుట్టూ తిరిగినా..**

పాషపూర్ తాండాకు చెందిన రాథోడ్ సునితకు 2025 మే 18న బోంరాస్పేట్ మండలం ముద్దాయిపేట్ సూర్యనాయక్ తాండాకు చెందిన జాతవత్ శ్రీనివాస్‌తో వివా హమైంది. పెళ్లి అనంతరం కల్యాణలక్ష్మి ్మ పథకం కోసం సునిత కుటుంబ సభ్యులు పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయంలో దర ఖాస్తు చేసుకున్నారు. అయితే నెలలు గడుస్తున్నా చెక్కు రాక పోవ డంతో పాటు, కార్యాలయం నుంచి ఎలాంటి సమాచారం అందకపోవడంతో పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా సరైన సమాధానం లభించలేదు.

**ఆర్డీఓ కార్యాలయంలో తెలిసిన అసలు నిజం**

అనంతరం తాండూరు ఆర్డీఓ కార్యాలయాన్ని సంప్రదించగా, ఆ చెక్కు కొద్ది రోజుల క్రితమే పంపిణీ అయినట్లు అధికారులు తెలిపారు. దీంతో దిగ్భ్రాంతి చెందిన బాధితులు వెంటనే పెద్దేముల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించి బ్యాంకు స్టేట్‌మెంట్ చూపించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

**ఇద్దరి పేర్లు ఒకటే అవటంతో తప్పులో కాలు**

దరఖాస్తుదారు పేరు, ఊరు ఒకేలా ఉండటంతో అధికారులు పొరపాటున రాథోడ్ శాంతిబాయి (భర్త శంకర్, పాషపూర్) అనే మరో లబ్ధిదారుకు ఈ చెక్కును అందించినట్లు గుర్తించారు. సిబ్బంది బాధ్యతారాహిత్యం వల్ల ఒకరి ప్రయోజనం మరొకరి చేతుల్లోకి వెళ్లడంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**పొరపాటు సరిదిద్దుతాం: తాసీల్దార్**

ఈ ఘటనపై పెద్దేముల్ తహసీల్దార్ వెంకటేష్ ప్రసాద్ స్పందిస్తూ, పొరపాటుగా వేరొకరికి అందిన చెక్కును తిరిగి రికవరీ చేసి, త్వరలోనే అసలైన లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న డీపీఓ

# మట్టి గణపతిని పూజిద్దాం

## కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్, ప్రభాతవార్త:** మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్ నందు తెలంగాణా కాలుష్య నియంత్రణ మండలి అధ్వర్యంలో పర్యావరణ ఇంజనీర్ శరత్ చంద్ర వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ దీపక్ తివారిని మర్యాదపూర్వకంగా కలిసి వినాయక చవితి సందర్భంగా వినాయక విగ్రహాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వినాయక చవితి వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను మాత్రమే ప్రతిష్టించి, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, నదులు, ఇతర జల వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని తెలిపారు. మట్టి వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా జల వనరుల పరిరక్షణకు తోడ్పడటంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సిబ్బందికి వినాయక మట్టి విగ్రహాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వ రాజ్ గుట్టుర్, జడ్పీ సీఈఓ సుదీర్, బిసి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, ఎస్సి వెల్ఫేర్ అధికారి జైపాల్ రెడ్డి, డీపీఓ జయసుధ, డీపీఆర్ఓ చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



డప్పుల దరువులతో పాదయాత్ర చేస్తున్న డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్ తదితరులు

పాలాభిషేకం చేసి నివాళులు అర్పించారు.

అనంతరం డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్‌గా దళిత బిడ్డ ఉండటం వల్లనే మాజీ సిఎం కెసిఆర్ అసెంబ్లీకి రావటం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని సంక్షేమ పథకాల అమలును ఆ పార్టీ నాయకులు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి ప్రజలకు చేసింది ఏమీ లేదని.. ఒకే కుటుంబం బాగుపడిందన్నారు. ప్రతిపక్ష నేత పాత్ర పోషించాల్సిన కెసిఆర్ ఫామ్‌హౌస్‌కు పరిమితం అయ్యారన్నారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి చేస్తున్నది కూడా భూముల కబ్జాలు మినహా మరొకటి లేదన్నారు.

ఆత్మగౌరవ నినాదంతో శామీర్‌పేటలో కాంగ్రెస్ ప్రదర్శన

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా హోరెత్తిన డప్పుల దరువు చప్పుళ్లు

# దద్దరిల్లిన దండోరా

**శామీర్‌పేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాత మధును, నవీన్‌రెడ్డిలను శాసనమండలి నుంచి బర్తరఫ్ చేయాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవులను అవమానించటం శోచనీయమని బిఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. ఆత్మగౌరవ పరిరక్షణ నినాదంతో బుధవారం శామీర్‌పేటలో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున డప్పులు, దరువులతో పాదయాత్ర-ర్యాలీ నిర్వహించారు. ఓఆర్ఆర్ సమీపంలోని దొంగల మైసమ్మ చౌరస్తా నుంచి తూంకుంటలోని అంబేదర్ విగ్రహం వరకు జరిగిన ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి, సైబరాబాద్‌ల మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని 16డివిజన్ల నుంచి మూడు మున్సిపాల్టీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చారు. స్పీకర్‌పై బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు చేసి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తూంకుంటలోని అంబేద్కర్ విగ్రహానికి

**డిసిసి చీఫ్ వజ్రేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున పాదయాత్ర**

**తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు**

**అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం**

**రాజ్యాంగ బద్ధ పదవుల పరిరక్షణకు ప్రతిజ్ఞ**

**ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌రెడ్డిల బర్తరఫ్‌కు డిమాండ్**



ఘట్‌కేసర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్పీకర్‌పై అనుచితంగా మాట్లాడిన బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు తాత మధు, నవీన్‌రెడ్డిలు ఇప్పటికైనా ఆయనను కలిసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వారిద్దరినీ వెంటనే శాసనమండలి సభ్యత్వం నుంచి బర్తరఫ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, ఎస్ఐఆర్ ఇన్‌చార్జి గజ్జెల కాంతం, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి పి.మహిపాల్‌రెడ్డిలు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్, జిల్లా ఆర్టీఎ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అద్యక్షులు



నక్క సందీప్‌గౌడ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీషకృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం, పలు డివిజన్ల పార్టీ అధ్యక్షులు, పార్టీకి చెందిన కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్ :** ఘట్‌కేసర్‌లోనూ ఆందోళనలు కొనసాగాయి. డివిజన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విగ్రహం వద్ద కనక డప్పులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్, కార్యదర్శి మామిండ్ల ముత్యాల్ యాదవ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ సభ్యులు మచ్చేందర్‌రెడ్డి, జిల్లా మత్స్య శాఖ సొసైటీ డైరెక్టర్ వెంక టేష్‌ముదిరాజ్, సీనియర్ నాయకుడు ముల్లి జంగయ్యయాదవ్, మాజీ కౌన్సిలర్ కడపొల్ల మల్లేశ్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఫరూక్, యూత్ ప్రెసిడెంట్ సంజీవ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. కేసీఆర్‌తోపాటు మధు, నవీన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## అసెంబ్లీ గొడవలకు కెసిఆరే సూత్రధారి

**మేం ఎవరి చావూ కోరలేదు**

**మహిళా పోలీసుల పట్ల మీరే అసభ్యంగా ప్రవర్తించారు**

**షాద్‌నగర్ కాంగ్రెస్ నేతల ధ్వజం**



అసెంబ్లీ వద్ద బిఆర్‌ఎస్ నాయకుల ఫొటోలను ప్రదర్శిస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చోటుచేసుకున్న వివాదాలకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆరే ప్రధాన సూత్రధారి అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రఘునాయక్ ఆరోపించారు. కేటీఆర్, హరీశ్ రావు, తాతా మధు, నవీన్ రెడ్డిలు ఇందులో పాత్రధారులుగా వ్యవహరించారని కాంగ్రెస్ సీనియర్ నేత రాష్ట్ర గిరిజన ఆదివాసి విభాగం కోఆర్డినేటర్ పి రఘునాయక్ విమర్శించారు. బుధవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిరసన ప్రదర్శన చేపట్టారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, తాతా మధుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఫరూక్‌నగర్, కొత్తూరు, కొందుర్గు, కేశంపేట, నందిగామ, చౌదరిగూడ, షాద్‌నగర్‌తో పాటు కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకులు, పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అదేవిధంగా మహిళా పోలీసులతో కొందరు బీఆర్‌ఎస్ నాయకులు అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించిన రఘునాయక్, ఇందుకు సంబంధించిన ఫొటోలను పోస్టర్ల రూపంలో మీడియాకు ప్రదర్శించారు. ఎమ్మెల్సీ తాతా మధు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని రఘునాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ రఘునాయక్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు విశాల శ్రావణ్ రెడ్డి, సీనియర్ నాయకులు చెంది తిరుపతి రెడ్డి, కృష్ణ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు గౌడ్, జగదీష్ అప్పా, సింగిల్ విండో చైర్మన్లు చల్ల శ్రీకాంత్ రెడ్డి, జితేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, పసుల బుచ్చయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాయ్‌కల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ

# 25 తులాల బంగారం రికవరీ

## అంతర్రాష్ట్ర దొంగ నుంచి స్వాధీనం

**వికారాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లాలో సంచలనం సృష్టించిన అంతర్రాష్ట్ర దొంగ వికాస్ సింగ్ అలియాస్ తేజా సింగ్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. నిందితుడిని కస్టడీకి తీసుకుని విచారించడంతో వికారాబాద్, పరిగి పోలీస్ స్టేషన్ల పరిధిలోని మొత్తం 8 కేసులకు సంబంధించి సుమారు 25 తులాల బంగారాన్ని పోలీసులు రికవరీ చేశారు.

మే 1, 2026 రాత్రి వికారాబాద్ టౌన్ పరిధిలోని మణికంఠ నగర్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరగగా, బంగారం, నగదు అపహరణకు గురయ్యాయి. ఈ కేసులో అరెస్టయి ప్రస్తుతం జైలులో ఉన్న కరుడుగట్టిన దొంగ వికాస్ సింగ్‌ను జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు, డీఎస్పీ అంజయ్య పర్యవేక్షణలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్ రాయ్, టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘు కుమార్ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించింది. నిందితుడు ఇచ్చిన సమాచారంతో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సుల్తాన్‌పూర్ జిల్లా కుడువర్ టౌన్‌లోని బాబా సాలిక్ రామ్ బంగారం దుకాణంలో నిందితుడి తల్లి లీలావతి ద్వారా గిరువ పెట్టిన బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీ చేసిన సొత్తును యూపీలోని కుడువర్ తదితర ప్రాంతాల్లోని అశోక్ కుమార్ సోనీ, వికాస్ అగ్రహారి వంటి బంగారం వ్యాపారులకు విక్రయించినట్లు విచారణలో తేలింది.

ఆ దుకాణాల నుంచి కూడా మరిన్ని వివరాలు రాబట్టి దొంగసొత్తును రికవరీ చేసేందుకు ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతోంది.

దొంగసొత్తును కొనుగోలు చేసే రిసీవర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, నేరాలకు సహకరించే వారిపై చట్టపరంగా అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా హెచ్చరించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీసీఎస్, టౌన్ ఇన్‌స్పెక్టర్లను మరియు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.





# కాళోజీకి నివాళి

**వికారాబాద్, ప్రభాతవార్త :** కలెక్టరేట్‌లో వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అద్వర్యంలో బుధవారం కాళోజి నారాయణరావు జయంతి నిర్వహించారు. కలెక్టర్ దీపక్ తివారి కాళోజి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తన రచ నలు, కవిత్వం ద్వారా ప్రజల సమస్యలను నిర్భయంగా ప్రపంచానికి తెలియజేసిన ప్రజాకవి అని అన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతి, ప్రజల జీవన విధానాన్ని తన సాహిత్యంలో ప్రతిబింబించిన మహోన్నత వ్యక్తి కాళోజి అని పేర్కొన్నారు. సామాజిక అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని తెలిపారు. కాళోజి ఆశయాలు, ఆలోచనా విధానం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, యువత ఆయన సాహిత్యాన్ని అధ్యయనం చేసి సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, డి ఆర్‌ఓ స్వర్ణలత, ఆర్‌డిఓ వాసుచంద్ర, డిప్యూటి కలెక్టర్ పూజ, వ్యవసాయ శాఖ అధికారి కవిత, డిపిఆర్‌ఓ చెన్నమ్మ, జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# చెక్ పవర్ నిబంధనలు యథాతథం

## జీవోల విడుదలకు కమిషనర్ హామీ

**షాద్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** తెలంగాణ ఉప సర్పంచుల ఆందోళనకు భారీ స్పందన లభించింది. స్థానిక సంస్థల్లో తమ హక్కులు, ప్రాధాన్యత కోల్పోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉప సర్పంచులకు రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ అధికారుల నుంచి కీలక హామీ లభించింది. గ్రామ పంచాయతీల పాలనలో తమ ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు, అభివృద్ధి పనుల్లో తమ ప్రాధాన్యతను నిలబెట్టుకునేందుకు ఉప సర్పంచుల సంక్షేమ సంఘం క్షేత్రస్థాయి నుండి హైదరాబాద్ వరకు పోరాటానికి దిగింది.

ఇందులో భాగంగా హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన అత్యవసర భేటీ అనంతరం, నాయకుల బృందం పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, వైస్ చైర్మన్ సుధీర్ రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఉప సర్పంచుల చెక్ పవర్ సాధారణ నిబంధనల ప్రకారమే కొనసాగు తుందని కమిషనర్ భరోసా ఇచ్చారు. పంచాయతీ పనుల ప్రారంభ, ప్రారంభోత్సవ శిలాఫలకాలపై ఉప



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఉప సర్పంచ్‌ల సంఘం నాయకులు

సర్పంచుల పేర్లు పొందుపరిచేలా త్వరలోనే ప్రత్యేక జీవో విడుదల చేస్తామని చెప్పారు.

మండల సర్వ సభ్య సమావేశాలకు ఉప సర్పంచులకు తప్పనిసరిగా ప్రోటోకాల్ ప్రకారం అధికారిక ఆహ్వానం పంపే విధంగాను, ప్రతి గ్రామ పంచాయతీ తీర్మానంపై ఉప సర్పంచుల సంతకం ఉండాల్సిందేనంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేయనున్నామని తెలిపారు. గంటపాటు సాగిన ఈ చర్చలు ఫలించడంతో ఉప సర్పంచుల సం ఘం తమ నిరసనను విరమించి హర్షం వ్యక్తం చేసిం ది. అరెస్టులను సహించి కూడా పోరాడిన ప్రతీ ఒక్కరికీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రవి

## మునగ మొక్కల పంపిణీ

**శామీర్‌పేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** మునగ సాగు ద్వారా మహిళా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి అన్నారు. బుధవారం మూడు చింతలపల్లిలో మహిళకు మునగ మొక్కలను పంపిణీ చేశారు. జిల్లా ఉద్యా నవన శాఖ ఆధ్వర్యంలో డిఆర్‌డిఎ-మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళా రైతులకు మునగ మొక్కల పంపిణీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ సాంబశివరావు, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీధర్, కమిషనర్ వెంకటగోపాల్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అజయ్‌లక్ష్మి పాల్గొన్నారు.

## గాంధీనగర్ దంపుడు బియ్యం స్థలం కేసులో కీలక మలుపు

### మున్సిపాలిటీకి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు జారీ

**షాద్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో గల దంపుడు బియ్యం స్థలానికి సంబంధించిన వివాదంలో మున్సిపాలిటీకి అనుకూలంగా మధ్యంతర ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ స్థలంలో ప్రతివాదులు జోక్యం చేసుకోకుండా 16వ అదనపు జిల్లా జడ్జి స్వాతి రెడ్డి, షాద్‌నగర్ న్యాయస్థానం అడ్‌ఇంటరిమ్ ఇంజంక్షన్ మంజూరు చేశారనీ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మున్సిపాలిటీ స్పెషల్ కౌన్సిల్, ప్రముఖ న్యాయవాది కంచి రాజగోపాల్ తెలిపారు. ప్రతివాదుల తరఫు న్యాయవాది కౌంటర్ దాఖలు చేయడం లేదని, ప్రధాన అప్పీల్‌లో నిర్ణీత గడువులో వాదనలు వినిపించేందుకు అప్పీలుదారు మున్సిపాలిటీ సిద్ధంగా ఉన్న పక్షంలో మధ్యంతర ఇంజంక్షన్ మంజూరుకు ఎటువంటి అభ్యం తరం లేదని న్యాయస్థానానికి తెలియజేశారు. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం ప్రతివాదులు జోక్యం చేసుకోకుండా ఉత్తర్వులు జారీ చేసింది.

# డాక్టర్ ఎక్కడ?

**మూగజీవాలకు అందని వైనం**

**పశువైద్యశాల సిబ్బంది నిర్లక్ష్యం**

**అత్యవసర సమయంలోనూ అవస్థలు పడుతున్నాం**

**రైతుల ఆవేదన**

**దుద్యాల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పశువైద్యశాలలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో రైతులు, పశువుల కాపరులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశువులను చికిత్స కోసం తీసుకొచ్చినప్పటికీ వైద్య సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అటెండర్ సైతం అందుబాటులో లేకపోవడంతో వైద్యశాలలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. చేనిగేరి రాములు, శ్యాసం వెంకటయ్య, అంజిలయ్య తదితర రైతులు మాట్లాడుతూ పశువులకు అత్యవసర సమయంలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రెగ్యులర్ పశువైద్యుడిని నియమించి, ఆసుపత్రిని అభివృద్ధి చేసి నిరంతరం వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



సిబ్బంది లేక వెలవెలబోతున్న దుద్యాల పశువైద్యశాల

## 11న జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్,సభ్యుల పర్యటన

**మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఈ నెల 11వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్, సభ్యులు జిల్లాలో పర్యటించనున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో ఆ కమిషన్ పర్యటన ఉంటుందన్నారు. జిల్లాలోని రేషన్‌షాపులను, పాఠశాలలను, అంగన్‌వాడి కేంద్రాలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించనున్నట్లు ఆరోగ్యకేంద్రాల్లో (ఎంసిహెచ్ కిట్స్,జాతీయ ఆహార భద్రతా చట్టం-2013 సెక్షన్ 4బి కింద ప్రసూతి ప్రయోజనాల అమలు) కింద పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో ప్రజలు ఏమైనా అభ్యంతరాలు తెలుపుటకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. అదే రోజున జిల్లా కలెక్టరేట్‌లో ఆ కమిషన్ చైర్మన్,సభ్యులు సమీక్ష సమావేశంలో పాల్గొంటారని అన్నారు. సంబంధిత అధికారులు తగిన సమాచారంతో రికార్డులతో ఈ పర్యటనకు, సమీక్షా సమావేశంకు సంబంధిత అధికారులు హాజరుకావాలని కలెక్టర్ మనుచౌదరి ఆదేశించారు.

## ఘనంగా 22వ విశ్వశాంతియాగము



ఎదులాబాద్‌లో విశ్వశాంతియాగం నిర్వహిస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లోని శ్రీభ్రమరాంబికా మల్లిఖార్జునస్వామి దేవాలయంలో బుధవారం 22వ విశ్వశాంతియాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ యజ్ఞ నిర్వహణకర్త కంట్లం గౌరీశంకర్ ఆధ్వర్యంలో ప్రతినెల మాసశివరాత్రి రోజున లోకకళ్యాణార్థం విశ్వశాంతియాగం నిర్వహిస్తున్నారు. మల్లిఖార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆలయ ఆవరణలోని విష్ణువినాయక కళ్యాణ మండపంలో విశ్వశాంతి యజ్ఞం నిర్వహించారు. నిర్వహకులు కంట్లం గౌరీశంకర్, కళావతి దంపతులు యజ్ఞంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆలయంలోని శివలింగానికి అభిషేకం చేశారు. అర్చకులు కుమారస్వామి మంత్రోచ్ఛారణాల మధ్య విశ్వశాంతిహోమం ఘనంగా జరిపారు. ప్రకృతి వైపరీత్యాలు తొలగిపోవాలని, దేశంలో సుభిక్షం, వర్షాలు సమృద్ధిగా కురవాలని, మానవ సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనాలనే సదుద్దేశంతో ఆపరమేశ్వరున్ని వేడుకుంటూ ప్రతినెలా యాగం చేస్తున్నామని గౌరీశంకర్ తెలిపారు. అనంతరం భక్తులకు పంచామృత తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ ఆర్‌బిఎస్ మాజీ సమన్వయకర్త కందకట్ల పద్మారెడ్డి, మాజీ వార్డుసభ్యులు ఎర్రోళ్ల మురళీ, ఉదారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీలు రాజీనామా చేయాలి



ఘట్‌కేసర్ నుంచి తరలివెళ్తున్న కాంగ్రెస్‌పార్టీ నాయకులు

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** గౌరవ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన శాసనమండలి సభ్యులు తాతా మధు, నవీన్‌రెడ్డిలకు చట్టసభల్లో కొనసాగే హక్కు లేదని మేడ్చల్ డిసిసి ఉపాధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ అన్నారు. తూంకుంట చౌరస్తాలో బుధవారం జరిగిన 500 డప్పులతో నిరసన ర్యాలీలో ఘట్‌కేసర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్ డివిజన్ల అధ్యక్షులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, సామల అమరేందర్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు తూంకుంటకు ఓఆర్ఆర్ మీదుగా నినాదాలు చేస్తూ తరలివెళ్లారు. డప్పుల దరువులు, ఆత్మగౌరవ నినాదాలతో కాంగ్రెస్ శ్రేణులు భారీ ప్రదర్శన చేపట్టారని తెలిపారు. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగబద్ధమైన పదవులను అవమానించే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిసిసి ప్రధానకార్యదర్శి బాలక్రిష్ణారెడ్డి, గడ్డిఅన్నారం డైరక్టర్ మచ్చేందర్‌రెడ్డి, కొమురవెల్లి సభ్యులు నరేశగౌడ్, సొసైటీ డైరక్టర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ డైరక్టర్లు సత్తయ్య, విశ్వనాథం, మాజీ వార్డుసభ్యులు వెంకట్‌రెడ్డి, శంకర్‌గౌడ్, భాస్కర్, శంకర్, నాయకులు మల్లేశ్‌యాదవ్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రేడియల్ రోడ్డు మార్గాన్ని మార్చాలి

**షాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** రేడియల్ రోడ్డు కూడలి ఏర్పాటుతో తమ ఇండ్లు, ఆస్తులు నిష్టపోతున్నామని సంకేపల్లిగూడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని సంకేపల్లిగూడ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ... సంకేపల్లిగూడ, శేరిగూడ గ్రామాల వద్ద రేడియల్ రోడ్డు కూడలి ఏర్పాటు చేసేందుకు 46 ఎకరాల 21 గుంటల భూమిని సేకరించేందుకు చర్యలు చేపడుతున్నారని. ఇందులో తమ ఇండ్లు, పొలాలు పోతున్నాయని అన్నారు. గ్రామస్తులకు ఇండ్లకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాన్ని చూడాలని అన్నారు. లేనిచో గ్రామస్తులం అందరం ధర్నా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, శ్రీధర్ రెడ్డి, వెంకట్ రెడ్డి; మల్లారెడ్డి, నవీన్ కుమార్, నరోత్తంరెడ్డి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో ఘనంగా కాళోజీ జయంతి

**షాద్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పంది వెంకట్ రాంరెడ్డి అధ్యక్షత వహించారు.

కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పంది వెంకట్ రాంరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల హక్కులు, స్వాభిమానం, సామాజిక చైతన్యం కోసం కాళోజీ నారాయణరావు తన రచనలు, ఉద్యమాల ద్వారా చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల గొంతుకగా నిలిచిన కాళోజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు మేకల వెంకటేష్, రవి గౌడ్, సునీల్ రెడ్డి, సిందం విటలయ్య, అద్దెట్ల రాజు, అల్లాడ శేఖర్, కుడుముల మల్లేష్, పినబాక ప్రబాకర్, సుదాకర్‌తో పాటు అసోసియేషన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) ఆధ్వర్యంలో**

**షాద్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** షాద్ నగర్ లోని అమరవీరుల స్తూపం దగ్గర పద్మవిభూషణ్ డాక్టర్ కాళోజి నారాయణరావు జయంతి వేడుకలను తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో షాద్ నగర్ తాలూకా తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ మూలే జనార్దన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ త్రిప్పిశెట్టి కరుణాకర్, కన్వీనర్ నక్క బాల్ రాజ్ యాదవ్, హెల్త్ మోటివేటర్ జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

# రూ.30 లక్షలతో సత్తర్‌కుంట గ్రామపంచాయతీ భవనం



సత్తర్‌కుంటలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు.

**దుద్యాల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని సత్తర్‌కుంట గ్రామపంచాయతీ నూతన భవనాన్ని రూ.30 లక్షల ప్రత్యేక నిధులతో నిర్మించారు. బుధవారం కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ పూజ, కార్యదర్శి యాదగిరిలను వారి స్థానాల్లో కూర్చోబెట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, పంచాయతీరాజ్ డీఈ సురేష్‌బాబు, ఏఈ సురేందర్‌రెడ్డి, ఎంపీడీవో జైపాల్‌రెడ్డి, సర్పంచులు లాలప్ప, నరేష్ రాథోడ్, నాన్య నాయక్, హన్యా నాయక్, ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ రవి నాయక్ నాయకులు రమేష్, రాము రాథోడ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల తరలింపులో నిర్వాహకుల నిర్లక్ష్యం



వినాయక తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి



గణేశ్ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తున్న దృశ్యం

**-ప్రమాదంపై సుదర్శన్‌రెడ్డి ఆందోళన**

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** పెద్ద వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తేనే గొప్ప భక్తులం అయిపోతామని అనుకోవద్దని హిందువులందరూ కలిసికట్టుగా భక్తిశ్రద్ధలతో గణేష్‌ఉత్సవాలను నిర్వహించడంతో పాటు ప్రతి ఒక్కరి భద్రతకు కూడా బాధ్యత వహించడంలో నిర్లక్ష్యం ఒక మనిషి ప్రాణం కోల్పోవడం ఎంతో బాధాకరమని ఇలాంటి ఘటనలు జరగకుండా నిర్వహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ ఘణాపూర్ పవర్‌గ్రిడ్ సమీపంలో భారీ ఎత్తయిన వినాయక విగ్రహాన్ని తరలించే సమయంలో పైభాగంలో ఉన్న విద్యుత్ తీగలకు తగిలి డ్రైవర్ ప్రాణాలు కోల్పోయిన ఘటనపై ఆయన తీవ్ర ఆవేదనతో పాటు నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ గణేష్ విగ్రహాల తయారీ జరుగుతున్న షెడ్లను ఆయన పరిశీలించారు. విగ్రహాల తయారీదారులు, నిర్వాహకులు తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. విగ్రహాలను తరలించే ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలను అవసరమైన మేరకు మార్పులు చేయాలని సంబంధిత విద్యుత్ అధికారులను కోరారు. భవిష్యతులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరానికి విగ్రహాలను ఇక్కడి నుంచి తరలించడం వల్ల ప్రమాదాలు జరుగడంతో పాటు ట్రాఫిక్‌కు ఆటంకం కల్గుతుందని ఒక యువకుడి ప్రాణం పోవడం అత్యంత దురదృష్టకరమని, ఈ ఘటనకు కారణమైన నిర్లక్ష్యాన్ని ప్రతి ఒక్కరూ తీవ్రంగా పరిగణించాలని అన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకుడు మహేష్, వీరారెడ్డి, విక్రాంత్ రెడ్డి, గుండె నరేష్, రామ్‌నాయక్, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డప్పులు కొడుతూ పాదయాత్ర చేసిన మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్,పలువురు కాంగ్రెస్ నాయకుల దృశ్యం

**బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధును, నవీన్‌రెడ్డిలను**

## శాసనమండలి నుంచి బర్తరఫ్ చేయాలి

**శామీర్‌పేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాత మధును, నవీన్‌రెడ్డిలను శాసనమండలి నుంచి బర్తరఫ్ చేయాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని ఓఆర్ఆర్ సమీపంలోని దొంగల మైసమ్మ చౌరస్తా నుంచి తూంకుంటలోని అంబేద్కర్ విగ్రహం వరకు రాజీవ్‌రహదారిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ భారీ ఎత్తున ఆత్మగౌరవ నినాదాలతో ప్రదర్శనను డప్పులు,దరువులతో పాదయాత్ర-ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, రాష్ట్ర హాజ్‌కమిటీ మెంబర్ ఎండి ముజీబుద్దీన్, శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్క సందీప్‌గౌడ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కె.శిరీష కృష్ణారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్, మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం, పలు డివిజన్ల పార్టీ అధ్య క్షులు, పార్టీకి చెందిన కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీలపై ఆగ్రహాజ్వాలలు

**ఆమనగల్లు, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీల బాధ్యతరహితమైన, అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మండల కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఎమ్మెల్సీల వైఖరి, బీఆర్ఎస్ పార్టీతీరును ఎండగడుతూ ఆమనగల్లు పట్టణంలో ఆందోళనచేపట్టింది. మండల పార్టీఅధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్ట ణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం ఆధ్వర్యంలో పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళనలో పాల్గొన్నారు. కార్యక్రమానికి మున్సిపాలిటీ చైర్మన్ పత్యనాయక్ హాజరై నారు. ఈసందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారిపై నిరసన ర్యాలీ నిర్వ హించారు. అనంతరం రాజీవ్ చౌరస్తాలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలు తాతామధు, నవీన్‌కుమార్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. ఈసందర్భంగా చైర్మన్ పత్య నాయక్, అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, అవ్వారి శివలింగంలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దళితుల సంక్షేమాభివృద్ధికి పాటుపడుతుంటే చూసి జీర్ణించుకోలేని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపై అక్కసు వెళ్లగక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, కో ఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖాదర్, జిల్లా నాయకులు వస్పుల మానయ్య, సీనియర్ నాయకులు దావ ధనుంజయ, కాలె మల్లయ్య, ఖాదర్ ఖాద్రి, శ్రీధర్‌రెడ్డి, రాగ్యానాయక్, ఐఎన్‌టీయుసి జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, గాజుల సురేష్, అబ్దుల్ అలీమ్, వగ్గు మహేష్, కండె సాయి, సురేష్ నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, శ్రీను నాయక్, దేవరశెట్టి మహేష్ , నాజర్, గుండ్రాతి కుమార్ గౌడ్, రఫీ, ఫిరోజ్, శివ, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుండి బర్తరఫ్ చేయాలి

**మోమిన్‌పేట్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా స్థానిక సంస్థల కోట ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహిస్తున్న తాతా మధు, శాసనసభలో రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గౌరవ గడ్డం ప్రసాద్ కుమార్ పైన ఆయన తల్లి పైన అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేసి అవమానపరిచిన తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించాలని ఎస్సీ సెల్ పార్లమెంట్ ఇంచార్జ్ సోమారపు రవి పేర్కొన్నారు. దాదాపు 56 సంవత్సరాల వయసులో ఉన్న నీవు న్యాయవిద్యను చదివి రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న స్పీకర్ మా అభిమాన నాయకుడిని అవమాన పరచడం అంటే నీవు అగ్రకులం కాబట్టి భారత రాజ్యాంగ విరుద్దమని, దళితుడని శాసనసభలో బహిరంగంగా అవమానించినావు, అయితే నీ తల్లిదండ్రులైన తాత వెంకట కృష్ణయ్య కమలమ్మలను అవమానించి దూషిస్తే నీవు ఊరుకుంటావా? రాష్ట్రంలో గాని దేశంలో గాని కుల వ్యవస్థను పూర్తిగా నిషేధించాలని, మనుధర్మ శాస్త్రమును అంతమొందించాలి జరిగిన ఈ పరిణామాలకు కారకుడైన తాతా మధుతోనే అదే అసెంబ్లీలో భహిరంగ క్షమాపణ చెప్పించి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి ఎమ్మెల్సీ పదవి నుండి తొలగించి జావితకాలం రాజకీయాలలో పాల్గొనకుండా జీవిత కాలం నిషేధం విధించాలనిసోమారపు రవి డిమాండ్ చేశారు.

## రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపిన నాయకుడు కెసిఆర్

**మొయినాబాద్ మండల బిఆర్ఎస్ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి**

**మొయినాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన అత్యంత నీచమైన, వివేకరహిత వ్యాఖ్యలను తీవ్రంగా నిరసిస్తూ మొయినాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మొయినాబాద్ సీఐ గారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడం జరిగింది.

బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధిగా ఉండి సమాజంలో హింసను, ద్వేషాన్ని ప్రేరేపించేలా మాట్లాడటం చట్టరీత్యా నేరమన్నారు. వెంటనే పోలీసులు స్పందించి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ నాయకులపై ఇలాంటి చిల్లర వ్యాఖ్యలు చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తాతామధు సభ్యత్వాన్ని రద్దు చేయాలి

**ఆమనగల్లు, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** రాజ్యాంగపదవిలో ఉన్న వ్యక్తిపై బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ తాతామధు అనుచిత వ్యాఖ్యలు చేయడం అత్యంత హేయమైన, బాధ్యతరహితమైన చర్యగా టిపిసిసి సభ్యుడు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్ అభివర్ణించారు. స్పీకర్ గడ్డంప్రసాద్‌పై చేసిన వ్యాఖ్యలకు బిఆర్ఎస్ పార్టీ పూర్తిబాధ్యత వహించి తాతామధు సభ్యత్వరద్దుతోపాటు గులాబి పార్టీకి బేషరత్తు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

బిఆర్ఎస్ పార్టీ తీరుతో స్పీకర్ కంటతడి పెట్టవలసి వచ్చిందన్న విషయాన్ని ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నా రన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## బిసి సేన నేతకు పరామర్శ

**షాద్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణ బీసీ సేన నాయకులు కత్తి చంద్రశేఖర్ మాతృమూర్తి కత్తి శంకరమ్మ దశదిన కర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువనాయకులు మురళీకృష్ణ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంకరమ్మ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, శంకరమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, కౌన్సిలర్లు శేఖర్, చందూలాల్, నాయకులు రవి యాదవ్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు. కత్తి శంకరమ్మకు బీసీ నేతల నివాళులు షాద్‌నగర్ పట్టణ బీసీ సేన నాయకులు కత్తి చంద్రశేఖర్ మాతృమూర్తి కత్తి శంకరమ్మ దశదిన కర్మ కార్యక్రమం జరిగింది.

## గిరిజన హక్కులను కాపాడాలి

**షాద్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** రేవంత్ రెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వాలు లంబాడిల పట్ల వివక్షత చూపుతూ, అటవీ హక్కుల చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయకుండా (లంబాడి) గిరిజనులను వారి భూముల నుంచి వెళ్లగొట్టే కుట్రలను వెనక్కి తీసుకోవాలని లంబాడి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మూడవాత్ రాంబల్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటి పరిష్కారంపై తగిన చర్యలు తీసుకోవడం లేదని వారు అన్నారు రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనులు తమ సమస్యల పరిస్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తామని రాంబల్ నాయక్ అన్నారు. అదే విదంగా రాష్ట్రంలో లంబాడీల భూములను గుంజుకుంటున్నాయని ఇలాంటి పనికిమాలిన చర్యలు మానుకోవాలని అదేవిధంగాఅటవీ హక్కుల చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసి గిరిజనులకు భూమిపై హక్కులు కల్పించాలని, గిరిజనులను వారి సాగుభూముల నుంచి తొలగించే చర్యలను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఏకలవ్య స్కూల్ లలో స్థానిక గిరిజనులకే ఉద్యోగాలు ఇవ్వాలని గిరిజన యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఉద్యమాన్ని నిర్మిస్తామని హెచ్చరించారు.

## ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవం

**షాద్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** షాద్‌నగర్ గిరిజన మహిళా డిగ్రీ మరియు పీజీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ నారాయణరావు గారి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. నీతా పోలే పాల్గొని విద్యార్థులకు తెలంగాణ భాషా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంతో ఆట, పాట, మాట, నృత్యాలతో అందరినీ అలరించారు. తెలుగు అధ్యాపకురాలు డా. డి. రమణమ్మ తెలంగాణ భాష గొప్పతనాన్ని చక్కగా వివరించారు. వి. రాజేశ్వరి గారు తెలంగాణ యాస, భాష విశిష్టతను తన పాటలు, కవితల ద్వారా వివరించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపక బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రాయికల్‌కు మండల కాంగ్రెస్ సారథ్యం

**షాద్‌నగర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** ఫరూక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన పూర్తి స్థాయి కార్యవర్గ కమిటీని మండల పార్టీ అధ్యక్షుడు కే. శ్రీనివాస్ (రాయికల్ శ్రీనివాస్) అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేందుకు అనుభవజ్ఞులైన, నిబద్ధత కలిగిన నాయకులతో ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలను ప్రజల వద్దకు చేర్చడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఫరూక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ సభ్యుల వివరాలుఉపాధ్యక్షులుగా సింగారం సుదర్శన్, కావలి శ్రీశైలం, సద్దుల ఆంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా దేవగిరి నవీన్, బుద్ద నర్సింహులు బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రధాన కార్యదర్శులుగా నంద్యాల పుల్లారెడ్డి, జమాల్ పూర్ రాజు, అధికార ప్రతినిధులుగా ఎండి. అజ్మత్ బాబా అలీ, కర్రోల్ల యాదయ్య నియమితులయ్యారు. కోశాధికారులుగా జంగయ్య వడ్ల, భరత్ పోలేమోని, కార్యదర్శులుగా పూజారి లక్ష్మయ్య, ఎండి. మునావర్ (మున్నా), సంజు నాయక్‌లను నియమించారు. సంయుక్త కార్యదర్శులుగా జి. యాదయ్య గౌడ్, ఎ. అఖిల్, లంకల భరత్ సింహ్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఖాజా లయిక్ అహ్మద్, యాదగిరి దాసరి, వీరమోని రాజులను నియమించారు. నూతనంగా నియమితులైన నాయకులందరికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కార్యవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## అట్టహాసంగా వాలీబాల్ పోటీలు

**కొడంగల్,సెప్టెంబరు 9,ప్రభాతవార్త:**

పాఠశాలల క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం 70వ స0ఉ్కల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్ఎస్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో నియోజకవర్గంలోని కొడంగల్, దుద్యాల, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలకు చెందిన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అనంతరం విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, అథ్లెటికన్సలలో చక్కటి ప్రతిభను కనబర్చారు. విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా, సందడిగా కొనసాగాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, నాలుగు మండలాలకు చెందిన విద్యాశాఖ అధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.





వేముల నర్వ గ్రామంలో ఎస్ఐఆర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి

## ఎస్ఐఆర్ నోటీసులపై క్షేత్రస్థాయి పరిశీలన

**కేశంపేట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని వేముల నర్వ గ్రామంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న వారి అడ్రస్ గ్రూపులను కేశంపేట ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి పరిశీలించారు. నోటీసులు అందుకున్న వ్యక్తుల వివరాలు, చిరునామాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు, సలహాలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా, ఎలాంటి తప్పిదాలకుతావులేకుండా ప్రక్రియను నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని బి ఎల్ ఓ లకు, సంబంధిత శాఖ అధికారులకుదిశానిర్దేశం చేశారు. సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులుకలగకుండా అవసరమైన సహకారంఅందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రమేష్ నాయక్, ఆర్ ఐ వెంకటయ్య, గ్రామస్తులు చిన్న నరసింహ, శ్రీకాంత్, ఆంజనేయులు సంబంధితఅధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రాజకీయ పంచాయతీలను పక్కన పెట్టి**

## ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

**కేశంపేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** ప్రస్తుతం వర్షాలు లేక రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, వారి సమస్యలపై అసెంబ్లీలో చర్చించి ప్రత్యామ్నాయ మార్గాలనుఅన్వేషించాల్సిన ప్రజాప్రతినిధులు రాజకీయపంచాయితీలకు ప్రాధాన్యత ఇవ్వడం సరికాదని బీజేపీ తాలూకా ధార్మిక సెల్ కన్వీనర్ పసుల నర్సింహ యాదవ్ అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అసెంబ్లీని వేదికగా ఉపయోగించాల్సింది పోయి, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పరస్పరం ఆరోపణలు, రాజకీయపంచాయితీలకు దిగడం ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడదన్నారు. రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తుంటే, ప్రజలు తమ నిత్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే. వాటిపై దృష్టిపెట్టకుండా మీరు చేసుకుంటున్న రాజకీయపంచాయితీలను చూసి ప్రజలు అసహ్యించు కుంటున్నారని అన్నారు. రాజకీయాలు కాదు.. ప్రజా సమస్యలే ప్రాధాన్యం కావాలి. ప్రజల కోసం పనిచేసి, వారి సమస్యలను అసెంబ్లీలో బలంగా ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేయాలని పసుల నర్సింహ యాదవ్ సూచించారు

## పూజలు చేసిన బిఆర్ఎస్ నాయకులు



**యాచారం, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** యాచారం మండల పరిధిలోని నంది నపర్తి నందీశ్వరాలయంలో భారత రాష్ట్ర సమితి పార్టీ, గ్రామ ఉపసర్పంచ్ జెనిగె శ్రీశైలం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు మొక్కుకున్నారు. మాజి సర్పంచ్ వర్త్యావత్ రాజు నాయక్ జన్మదిన సందర్భంగా అర్చన చేపించి వారు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నారు. అనంతరం శ్రీశైలం మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు కురవాలని పాడి పంటలు సమృద్ధిగా పండి రైతులు ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరారు. మాజీ సర్పంచ్ వర్త్యావత్ రాజు నాయక్ చేసిన సేవలు గుర్తుచేస్తూ ఆయన వెంట ఉండి పార్టీ కోసం నిరంతరం కృషి చేస్తున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం లో నాగేంద్ర గురుస్వామి, వార్డు సభ్యులు యంజాల విజేత చంద్రకాంత్, నీట్టి బీరప్ప, సీనియర్ నాయకులు యాదయ్య గౌడ్ రాందాస్ యాదయ్య, బుగ్గరాముల, కొంగరి బిక్షపతి, నరసింహ, ప్రవీణ్ , చింటూ, సూర్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**టేకులపల్లి గ్రామ రైతు వేదికలో**

## ఆత్మ శిక్షణ కార్యక్రమం

**మోమిన్‌పేట్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** మండల పరిధిలోని టేకులపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతికయాజమాన్య సంస్థ (ఆత్మ) శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి రామకృష్ణా రెడ్డి తెలిపారు. బుధవారం రైతులకు రికగ్నిషన్ ప్రియర్ లెర్నింగ్ శిక్షణ (ఆర్‌పిఎల్) ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సిఫారసు చేసిన వరి రకాల ప్రోత్సాహం, హెచ్‌టీ పత్తి వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలు, సహజ వ్యవసాయం, నానో ఎరువుల వినియోగం, నూనె గింజల పంటల సాగు, మార్కెట్ ఆధారిత వ్యవసాయం, సమగ్ర వ్యవసాయ విధానం, ఎరువుల సమతుల్య వినియోగం మరియు కిచెన్ గార్డెనింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతు రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించి సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందేలా వ్యవసాయ శాఖ వారి సూచనలు పాటించాలని తెలిపారు. సహజ వ్యవసాయం, నానో ఎరువులు, నూనె గింజల సాగు మరియు సమగ్ర వ్యవసాయ విధానాలను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాయిస్, మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ పంచాయతి కారోబార్ నర్సింలు, ఏఇఓలు పెంటయ్య, స్వాతి మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్షమాపణ చెప్పాలి

**నందిగామ, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండ పోరాడి తెలంగాణను సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దూషించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చర్యలు తీసుకోవాలని శ్రీనివాసులు గూడ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, మహిళలు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు శ్రీలత, లక్ష్మమ్మ, కుమ్మరి మల్లేష్, కుమ్మరి అంజయ్య, లచ్చగారి శ్రీనివాసరెడ్డి, లచ్చగారి రాంరెడ్డి, బి రాజిరెడ్డి, జనుముల కృష్ణయ్య, కుమ్మరి లింగం, ముట్యార్ యాదిరెడ్డి తదితరులు ఉన్నారు.

## రోగులకు పండ్లు, విద్యార్థులకు బిర్యానీ పంపిణీ

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లోని సామాజిక ఆసుపత్రిలో బుధవారం బీఆర్ఎస్‌పార్టీ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్డుప్యాకెట్లు పంపిణీ చేశారు. ఎదులాబాద్‌లోని సాంఘిక సంక్షేమ వసతిగృహం, మైసమ్మ గుట్టలోని ప్రాథమికపాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు బోజన వితరణ కార్యక్రమం నిర్వహించారు. మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి జన్మదినం సందర్భంగా ఉమ్మడి మండల నాయకులు హాస్టల్ విద్యార్థులతో కలిసి కేక్‌చేసి వారికి తినిపించారు.

# గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఐ

**పెద్దేముల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** గణేష్ ఉత్సవాలను అన్ని వర్గాల ప్రజలు కలిసి మెలిసి ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ అన్నారు. బుధవారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయా గ్రామాల నాయకులతో, యువకులతో, గ్రామపెద్దలతో కలిసి శాంతిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ మాట్లాడుతూ విగ్రహ ప్రతిష్టాపన, మండపం ఏర్పాటు, ఊరేగింపు, లౌడ్ స్పీకర్ల వినియోగానికి అవసరమైన అనుమతులు ముందుగానే తీసుకోవాలని అన్నారు. మండపాలు, ఊరేగింపు మార్గాలవల్ల వాహనరాకపోకలకు అంత రాయం కలుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వం, పోలీసుల నిబంధనలకు అనుగుణంగా మాత్రమే సౌండ్ సిస్టమ్ వినియోగించాలని అన్నారు. అధికశబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించ కూడదని అన్నారు. మండపాల్లో విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉత్సవాల సమయంలో రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఉత్సవాలపేరుతో మద్యం సేవించి రోడ్లపై హంగామ చేయడం, గొడవలకు దిగడం, ఇతరులకు ఇబ్బంది కలిగిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. ధృవీకరించని వార్తలు, రెచ్చగొట్టె పోస్టులు, వివాదస్పద వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేయ కుండా బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. ఉత్సవాల విజయవంతమైన నిర్వాహణకు నిర్వాహకులు, ప్రజలు, పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, డిప్యూటీ నర్సిములు, నారాయన్‌గౌడ్, జిల్లా కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి, కార్యదర్శి యండి.నసీర్, మండల పార్టీ అధ్యక్షులు పి.మహిపాల్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల ప్రవీన్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆగమన్ తో కొత్త సంస్కృతికి తెరలేపకండి



మాట్లాడుతున్న చేవెళ్ల జోన్ డిసిపి యోగేష్ గౌతమ్

**మొయినాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** సనాతన ధర్మంలో లేని సంస్కృతిని తెరలేపి ఆగమన్ పేరిట నిర్వహించే స్వాగతం కార్యక్రమాలను గణేష్ ఉత్సవ నిర్వాహకులు విరవించుకోవడం ఉత్తమమని చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతం కుమార్ ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మొయినాబాద్ మండల కేంద్రంలో గణేష్ ఉత్సవ నిర్వాహకులతో పోలీసులు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ యోగేష్ గౌతం కుమార్ పాల్గొని మాట్లాడుతూ భగవంతున్ని ప్రతిష్టించే సమయంలో రూపాన్ని ఎవరికి కనిపించకుండా మూసివేస్తారని.. ప్రతిష్టించిన తరువాత ప్రత్యేక పూజలు నిర్వహించే సమయంలో ఆ భగవంతుని రూపాన్ని భక్తులకు చూపిస్తారని.. కానీ ఇందుకు విరుద్ధంగా హిందూ సనాతన ధర్మంలో లేని విధంగా ఆగమని పేరిట భగవంతుణ్ణి ముందే ప్రదర్శించడం వేదాల్లో ఎక్కడ లేదని.. ఈ సంప్రదాయాన్ని నిర్వాహకులు విరమించుకోవడం ఉత్తమమని చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతం సూచించారు. చేవెళ్ల జోన్ పరిధిలో మూడు సీట్లకు పైగా ఎత్తులో ఉన్న విగ్రహాలు 1900 పైన మండపాలు ప్రతిష్టించనున్నట్లు సమాచారం అందిదన్నారు. నిమజ్జన సమయంలో డీజేలకు అధిక ప్రాధాన్యత వద్దని..మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరి పెట్టుకోవాలని..మట్టి విగ్రహాలు నెలకొల్పేందుకు కృషి చేయాలి అన్నారు. వినాయక చవితి పండుగను విజయవంతంగా పూర్తి చేసినందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్ గౌడ్, మొయినాబాద్ సీఐ మల్లికార్జున రెడ్డి, జోన్ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఐలు ఉన్నారు.

## వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి



పూడూరు మండలం చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన శాంతి సమావేశంలో మాట్లాడుతున్న పరిగి సిఐ శ్రీనివాస్‌రెడ్డి,ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు

**పూడూరు, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో ప్రతిష్టించే వినాయక మండపాలకు అనుమతులు తప్పకుండ తీసుకోవాలని సిఐ కొండల్‌రెడ్డి పేర్కొన్నారు.బుధవారం పూడూరు మండలం పరిధిలోని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌లో వినాయక నిర్వాహకులు,వివిధ రాజకీయ నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో శాంతిభద్రతలకు అగాదం కలుగకుండా ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు.వినాయక మండపం నిర్వాహకులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.విద్యుత్తు సౌకర్యంకోసం సంబంధిత అధికారులతో అనుమతులు తీసుకోవాలన్నారు.మండపాలలో సిసి కెమెరాలను ఏర్పాటుచేయాలని,రాత్రి సమయంలో 10గంటలలోపు మైకులను బందు చేయాలని వివరించారు.మండపాలలో రాత్రిపూట నిర్వాహకులు ఉండాలని తెలిపారు.మండపాల నిహకుల అధ్యక్ష,కార్యదర్శులపేర్లు,వారి ఫోన్‌నెంబర్లను పొందుపరుచాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ భరత్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు చేయండి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** వినాయక నిమజ్జన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేయాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ లక్ష్మీనారాయణచెరువును బుధవారం ఆయన ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాతో కలిసి సందర్శించారు. చెరువులో పేరుకుపోయిన పూడికతీతను తొలగించేందుకు జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. చెరువులో గత కొన్ని సంవత్సరాల నుండి వినాయక, దుర్గమాత విగ్రహాల నిమజ్జనాలు



చేస్తుండటంతో తూము వద్ద వ్యర్థాలు పేరుకుపోగా ఈసారి ఇబ్బంది కలగకుండా ముందస్తుగానే లాంగ్ బూమ్ హిటాచి తో విగ్రహాల తీసివేత పనులను చేపట్టారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాబోయే వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించినారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ డిప్యూటీ కమిషనర్ అల్లూరి వాణిరెడి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్‌బాబు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నరేశ్‌కుమార్, శ్రీనివాస్, అసిస్టెంట్ ఇంజనీర్లు రవి కిరణ్, విశేష్‌నాయక్, శానిటేషన్ సిబ్బంది, ఎదులాబాద్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సామల అమరేందర్, సొసైటీ మాజీ డైరెక్టర్ గాయరు విశ్వనాథం, మాజీ వార్డుసభ్యులు మెట్టు రమేశ్ పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో శ్రీకాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,పాల్గొన్న జిల్లా అధికారుల దృశ్యం

## కలెక్టరేట్‌లో జరిగిన శ్రీకాళోజీ జయంతి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో శ్రీకాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలను నిర్వహించారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో శ్రీకాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొని పూలమాల వేసి జ్యోతి వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి వై.దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకాళోజీ నారాయణరావు జయంతి ఉత్సవాలు జరిగాయి. శ్రీకాళోజీ నారాయణరావు సేవలను ఆయనతో పాటు పలువురు అధికారులు స్మరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి వినోద్‌కుమార్, కలెక్టరేట్ ఎఓ కెవివి సీతారామ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కీసర నవోదయలో ఘనంగా కాళోజీ జయంతి

**కీసర, సెప్టెంబరు9, ప్రభాతవార్త:**

కీసర సర్కిల్ పరిధిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు.కాలోజీ చాత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ప్రధానోధ్యాయులు మాధవరావు మాట్లాడుతూ కాళోజీ తత్వం అంటే ప్రజల పక్షాన నిలబడటం ,అన్యాయాన్ని ప్రశ్నించడం, మానవత్వాన్ని గౌరవించడం ,సమాజం పట్ల బాధ్యతతో జీవించడం అని వివరించారు .విద్యార్థులు కాళోజీ రచనలోని సామాజిక సందేశాలను నేటి సమాజానికి అన్వయిస్తూ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు."పుట్టుక నీది చావు నీది బ్రతుకంతా దేశానిది" అనే కాళోజీ ప్రసిద్ధ సందేశాన్ని గుర్తు చేస్తూ విద్యార్థులు తమ వ్యక్తిగత ప్రయోజనాలతో పాటు సమాజం,దేశం పట్ల బాధ్యత కలిగి ఉండాలని సూచించారు.కాళోజీ చూపిన నిజాయితీ ధైర్యం,మానవతా దృక్పదం,సామాజిక బాధ్యత వంటి విలువలను విద్యార్థులు తమ జీవితాల్లో ఆచరించాలని పిలుపునిచ్చారు.కాళోజీ ఆశయాలను కొనసాగిస్తూ మంచి సమాజ నిర్మాణానికి భాగస్వాముల మవుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.విద్యార్థుల కోసం కాళోజీపై వ్యాసరచన,వక్తృత్వం,కవితా పఠనం,సాహిత్య ప్రదర్శనలు,కవితలను ఆలపిస్తూ,ఆయన ఆశయాలను ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి.



నవోదయ పాఠశాలలో కాళోజీ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న విద్యార్థి

### జలసాధన కమిటీ ఆధ్వర్యంలో...

**కొడంగల్,సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

జలసాధన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఉమ్మడి పాలమూరు జిల్లా కొడంగల్ తాలూకా జలసాధన కమిటీ కన్వీనర్ బాకారం శ్రీనివాస్



అంబేద్కర్ చౌరస్తాలో ర్యాలీగా వచ్చిన జలసాధన కమిటీ సభ్యులు

అద్వర్యంలో ర్యాలీగా తరలివెళ్ళి స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో కాళోజీ జయంతి వేడుకలు నిర్వ హించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ పాలమూరు, రంగా రెడ్డి లిఫ్ట్ నీటిని డిండి లిఫ్ట్ పేరు నల్గొండకు తరలించడం అన్యాయమని అన్నారు.లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మించాలని, అమ్రా బాద్ లిఫ్ట్ చేపట్టాలని ,ఆర్‌డీఎస్ నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు.కృష్ణ భీమా సంగమం తంగడి నుంచి 72 జీవోతో భారీ ఎత్తిపోతల చేపట్టాలని కోరారు.పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు.కార్యక్రమంలో జలసాధన కమిటీ సభ్యులు హన్మయ్య తదితరులు పాల్గొన్నారు.




అంగన్‌వాడీ టీచర్లను ముందస్తుగా అరెస్టు చేసిన షాబాద్ పోలీసులు

## అంగన్‌వాడీ టీచర్ల అరెస్టులు అప్రజాస్వామికం

**షాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్–అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయమ్మలను ముందస్తుగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ షాబాద్ అంగన్‌వాడీ సెక్టార్ అధ్యక్షురాలు చంద్రకళ అన్నారు.శాంతియుతంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం వెళ్తున్న అంగన్వాడీ టీచర్లను ముందస్తుగా అరెస్టు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు.అంగన్‌వాడీ ఉద్యోగులు అనేక సంవత్సరాలుగా తక్కువ వేతనాలతో పనిచేస్తూ మహిళలు, చిన్నారులకు నిరంతరం సేవలందిస్తున్నారని ఆమె తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## పోలేపల్లిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై గ్రామసభ

**దుద్యాల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 815, 816, 817 పరిధిలోని 17 మంది పట్టాదారులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనుమతితో ఆర్డీఓ కర్ర అనిత ఆధ్వర్యంలో సభ జరిగింది. పరిహారం, పునరావాస ప్యాకేజీకి సంబంధించిన అంశాలపై అధికారులు వివరాలు వెల్లడించారు. తహసీల్దార్ కిషన్, డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, ఆర్ఐ నవీన్ కుమార్, జిపిఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# క్రీడలు యువతకు ఎంతో మేలు



**తలకొండపల్లి ,సెప్టెంబరు9, ప్రభాతవార్త:**

క్రీడల ద్వారా విద్యార్థులకు యువకులకు ఎంతో మేలు జరుగుతుందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు, తలకొండపల్లి సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ అన్నారు. బుధవారం నాడు కలకొండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో 70వ ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రీడలు ద్వారా మానసిక ఉల్లాసం తోపాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. యువకుల మధ్యన సోదరభావం పెంపొంది ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు ఉపకరిస్తాయన్నారు . అనంతరం పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం అధ్యక్షులు శేఖర్‌యాదవ్ ఉప సర్పంచ్ కోటీశ్వర్ మాజీ సర్పంచ్ పెరుమాల లలిత జ్యోతి పలి సర్పంచ్ మల్లేష్ పెరుమాల జంగయ్య కుమార్ నరసింహ లింగం యాదవ్ రవి అసిఫా బాలరాజ్ పెరుమల రాములు వాసు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు ఉన్నారు.

### 70వ ఎస్‌జీఎఫ్ మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

**యాచారం,సెప్టెంబర్9, ప్రభాతవార్త:**

యాచారం మండల పరిధిలోని సెంట్ గ్రిగోరియస్ పాఠశాల ఆవరణలో 70వ ఎస్‌జీఎఫ్ (ఎస్‌జిఎఫ్) మండలస్థాయి క్రీడా పోటీలు మండల ఇన్‌చార్జి, మేడిపల్లి పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ వి.భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ థామ్సన్, ప్రిన్సిపాల్ ఆంటోనీ సమక్షంలో మండల వ్యాయామ ఉపాధ్యాయులు ఏర్పాట్లు చేశారు. ఈ క్రీడా పోటీలలో యాచారం మండలంలోని 14 పాఠశాలలకు చెందిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెంట్ గ్రిగోరియస్ పాఠశాల డైరెక్టర్ థామ్సన్, ప్రిన్సిపాల్ ఆంటోనీ, తెలంగాణ పీడీ పీఈటీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ సాబేర్ హాజరయ్యారు. మండల ఇన్‌చార్జి. వి. భాస్కర్ నాయక్ మాట్లాడుతూ .. మండలస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అవకాశం కల్పించిన సెంట్ గ్రిగోరియస్ పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జోనల్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ ఆంటోనీ మాటాడుతూ.. తమ పాఠశాలను క్రీడా పోటీల నిర్వహణకు ఎంపిక చేసినందుకు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా పోటీల నిర్వహణకు తమ పాఠశాల ఎల్లప్పుడూ సహకరిస్తుందని తెలిపారు.తెలంగాణ పిడి పీఈటి ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ సాబేర్ గారు మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా మానసిక వికాసానికి కూడా ఎంతో దోహద పడతాయని అన్నారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు ప్రభుత్వం ఉపాధి, ఉద్యోగ అవకాశాల తోపాటు అనేక ప్రోత్సాహకాలు కల్పిస్తోందని చెప్పారు.మన ప్రాంతంలో స్పోర్ట్స్ యూనివర్సిటీతో పాటు దేశంలోనే అతిపెద్ద క్రీడా స్టేడియం ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, క్రీడాకారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు .అలాగే ప్రభుత్వ పాఠశాలలకు ప్రతి సంవత్సరం క్రీడా సామగ్రి కొనుగోలు కోసం రూ.25,000 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు . పాఠశాలల్లో పనిచేస్తున్న పీఈటీలకు పదోన్నతులు కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు.

# హిట్స్ కళాశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**కీసర,సెప్టెంబరు9,ప్రభాతవార్త** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని బోగారం లోని హోలీమేరీ కళాశాలలో ఉపాధ్యాయ వేడుకలు బుదవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రెసిడెంట్ వరప్రసాద్‌రెడ్డి,చైర్మన్ సిద్దార్ధరెడ్డి,సెక్రటరీ శారదారెడ్డి,డైరెక్టర్ ప్రీతిరెడ్డిలు సంయుక్తంగా జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సందర్భంగా ప్రెసిడెంట్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రాముఖ్యతను ముఖ్యంగా ఉపాధ్యాయ దినోత్సవం విశిష్టతను విద్యార్ధులకు వివరించారు.మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని సెప్టెంబరు 5న భారత ప్రభుత్వం గౌరవార్దం ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించిందని ఆయన గొప్ప విద్యావేత్తగా,విశ్వ విద్యాలయ ఉపాధ్యాయుడిగా,తత్వవేత్తగా ఎంతో కీర్తి ప్రతిష్టలు పొందిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు.పాఠాలు బోధించే వారి కంటే నేర్పే ప్రతివారు ఉపాధ్యాయులే అని అన్నారు.ఇటీవల శారదారెడ్డితో కలిసి లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయాన్ని సందర్శించడం జరిగిందని అది ఒక పెద్ద నగరంలా ఉంటుందని, విద్యార్దులు క్రమశిక్షణతో మెలగడం,ఉపాధ్యాయులు తమ వృత్తి ధర్మంలో వారి ప్రభావం తమను ఎంతో ఆసక్తిని కలిగించాయని పేర్కొన్నారు.చైర్మన్ సిద్దార్ధరెడ్డి మాట్లాడుతూ పరీక్షల సమయంలో విలువలతో కూడిన విద్య అత్యంత ముఖ్యమైనదని,సమాజంలో సరైన దిశానిర్దేశం చేసేది గురువులేనని స్పష్టం చేశారు.విద్యార్దులు క్రమశిక్షణతో మెలగాలని,ఉపాధ్యాయులు తమ వద్ద ఉన్న జ్ఞానాన్ని విద్యార్దులకు అందిస్తూ వారిని ఉన్నత స్దానాల్లో నిలబెడుతున్నారని తెలిపారు.సెక్రటరీ శారదారెడ్డి మాట్లాడుతూ "ఉపాధ్యాయ వృత్తి అనేది అతి పవిత్రమైన వృత్తి" అని పేర్కొన్నారు.

తాను ఇంత పెద్ద గ్రూపు సంస్దలను స్దాపించగలిగానంటే దానికి కారణం ఉపాధ్యాయ వృత్తి మీద తనకున్న నమ్మకమేనని తెలిపారు."విద్యార్దులు తాళం వంటి వారని తాళం చెవి సరిగ్గా తిప్పితేనే తాళం తెరుచుకుంటుందనే" ఉపమానంతో విద్యార్దుల మేధస్సును తట్టేలా వివరించారు.

అనంతరం విద్యార్దులు ఉపాధ్యాయు లును ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్,ఫార్మసీ ప్రిన్సిపాల్ రఘునందన్,మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ సుష్మ,బిఎడ్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి,పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సాయికుమార్, పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసిన వారిని అరెస్టు చేస్తారా

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** తమ సొంత డబ్బులు ఖర్చు చేసి గ్రామాలను ఎంతగానో అభివృద్ధి చేసిన మాజి సర్పంచ్‌లను అరెస్టులు చేస్తారా అని మాజి సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బాబురావు అన్నారు. గతంలో చేసిన పనులకు సంబందించిన బిల్లులను ప్రభుత్వాన్ని అడిగితే అక్రమంగ అరెస్టులలు చేయడం ఎంతో అవరకు సమంజసమని అన్నారు. మాజీ సర్పంచ్ లు ఆధ్వర్యంలో గ్రామాలలో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలనీ డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి చేయాలనీ మాజీ సర్పంచ్ లు పిలుపునిచ్చారు. మండలంలో సర్పంచ్‌లు హైదరాబాద్‌కు వెళ్లకుండ ఉదయం మండలంలోని మాజీ సర్పంచ్ లను పోలీసులు వారి ఇంటి దగ్గర హౌస్ అరెస్ట్ చేశారని అన్నారు. ప్రతి సారి అసెంబ్లీ సమావేశాల సందర్భంగా మాజీ సర్పంచ్ లు ఎక్కడ అసెంబ్లీని ముట్టడిస్తారో అని బయం తో నేడు సర్పంచ్ లను ముందస్తు గా అరెస్ట్ చేయడం పట్ల ప్రభుత్వం సమాధానం చెప్పాలని అన్నారు. ఎంతో కష్టపడి సొంత డబ్బులు , అప్పులు చేసి గ్రామాలలో అభివృద్ధి చేశామని, ఈ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాల పైన అవుతున్న చేసిన పనులకు బిల్లులు చెల్లించకుండ సర్పంచ్ ల యిబ్బంది పెడుతుందని అన్నారు. ప్రభుత్వంలో నిరసన తెలిపే హక్కులను కూడ హరిస్తున్న ఈ ప్రభుత్వం... కనీసం గ్రామ పంచాయతీ లకు రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క రూపాయినైనా గ్రామ పంచాయతీ లకు వేశారా అని ప్రశ్నించారు. పెద్ద పెద్ద కాంట్రాక్టలకు మాత్రం బిల్లులు చెల్లించి గ్రామాల్లో పనులకు మాత్రం బిల్లులు చెల్లించక పోవడం చాలా దారుణం వెంటనే ప్రభుత్వం చొరవ తీసుకొని ఆయా గ్రామపంచాయతీలకు రావాల్సిన బిల్లులు చెల్లించే విధంగా చూడాలని కోరారు.

## జాయింట్ చెక్ పవర్ విధానాన్ని రద్దు చేయాలి

**రంగారెడ్డిఅర్బన్, సెప్టెంబరు 9,ప్రభాతవార్త:** ప్రజలచే ఎన్నికైన సర్పంచ్‌లకు పూర్తి అధికారాలు కల్పించడంతో పాటు పూర్తి చెక్ పవర్ ఇవ్వాలని తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు చింపుల సత్య నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ పంచాయతీల పరిపాలనలో ప్రస్తుతం కొనసాగుతున్న జాయింట్ చెక్ పవర్ విధానం వల్ల అభివృద్ధి పనులు, ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు ప్రజలచే నేరుగా ఎన్నికైన ప్రజాప్రతినిధులని, గ్రామ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత వారిపై ఉంటుందని అన్నారు. గ్రామాల్లో పారిశుద్ధం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పచ్చదనం, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అనేక అంశాల్లో సర్పంచ్‌ల పాత్ర కీలకమని తెలిపారు.గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసే నిధులను ప్రజల అవసరాలకు అనుగుణంగా సద్వినియోగం చేయడానికి సర్పంచ్‌లకు పూర్తి స్వేచ్ఛ, అధికారాలు అవసరమన్నారు. జాయింట్ చెక్ పవర్ కారణంగా చిన్న చిన్న అత్యవసర పనులకు కూడా అనుమతులు, సంతకాల కోసం ఎదురు చూడాల్సి వస్తోందని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం గ్రామపంచాయతీలకు కల్పించిన విధులు, అధికారాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన కోరారు. గ్రామ పంచాయతీలకు నిధులు సకాలంలో విడుదల చేయడంతో పాటు, వాటి వినియోగంపై ఎన్నికైన సర్పంచ్‌లకు పూర్తి బాధ్యతలు అప్పగించాల్సిన అవసరం ఉందన్నారు.

## ఉపాధ్యాయుల సేవలు చిరస్మరణీయం

**దుద్యాల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** దుద్యాల్ మండలం హకీంపేట్ జెడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయ దినోత్సవం, తెలంగాణ ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. ప్రధానోపాధ్యాయులు జి.శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అనంతరం కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాష, సంస్కృతి, ప్రజల హక్కులు, సామాజిక చైతన్యం కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. కాళోజీ సందేశాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇల్లు.. పేదల సొంతింటి కలకు సాకారం

దుద్యాల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందని దుద్యాల్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్ అన్నారు. గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడ్, సుకవేణి దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొని ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతి రెడ్డి నాయకత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లతో అండగా నిలుస్తున్నారని అన్నారు. సొంతింటితో పేద కుటుంబాలకు భద్రత, ఆత్మగౌరవం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అవుటి శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మేర్గు వెంకటయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ వేణుగోపాల్, కృష్ణ, జింకల చంద్రయ్య, సంజీవ్ కుమార్, సత్యం, ఖాజ, హాజీ తదితరులు పాల్గొన్నారు.

## నీరుంటేనే ఊరుంటుంది

**జిల్లేడు చౌదరిగూడెం, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** గ్రామాల్లో నీరు పుష్కలంగ ఉంటెనే ప్రజలందరు ఉఖంగ ఉండి ఊరు సుభిక్షంగ ఉంటుందని ఎంపిడిఓ పుష్పలత అన్నారు. బుధవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో విబిజి రామ్‌జి గ్రామసభ కార్యక్రమాన్ని సర్పంచ్ సనాసలీమ్ ఆద్వర్యంలో పిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామ ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని అన్నారు. విబిజిరామ్‌జి పథకం ద్వార గ్రామంలో నీటి నిల్వ పనులు చేసుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గ్రామంలో ఐదు ఎకరాలలోపు భూమి కలిగిన వారందరు తమ పొలాల్లో పనులు చేసుకోవచ్చని పెర్కోన్నారు. గ్రామంలో గుర్తించిన పనులను గ్రామసభ తీర్మాణంతో అమోదింపజేసుకోవచ్చని అన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి మరుగుదొడ్డితో పాటు ఇంకుడుగుంతలను ఏర్పాటు చేసుకోవాలని ఆమె పెర్కోన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగె మండలంలోని చౌదరిగూడ, గుర్రంపల్లి, గాలిగూడ తదితర గ్రామాలలో గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ నర్సింగరావు, సర్పంచ్‌లు స్వప్న సత్యం, జంగయ్య, టెక్నికల్ అసిస్టెంట్‌లు లక్ష్మారెడ్డి, వినోద్‌కుమార్, కొండల్, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో విబిజిరామ్‌జి పథకం గురించి వివరిస్తున్న అధికారులు

## ఆర్కపల్లి మాజీ ఉపసర్పంచ్ షేక్ జమీల్ మృతి

### కుటుంబ సభ్యులను పరామర్శించిన నాయకులు,ఆర్థిక సాయం

**మాడ్గుల, సెప్టెంబరు, ప్రభాతవార్త :** ఆర్కపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ షేక్ జమీల్ (41) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జమీల్ మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సంతాపం వ్యక్తం చేసి, కుటుంబ సభ్యులను పరా మర్శించారు.మృతుడి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న నాయకులు కుటుం బానికి అండగా నిలిచేందుకు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్కపల్లి సర్పంచ్ కల్లు భాగ్యలక్ష్మి తిరుపతిరెడ్డి రూ.5 వేలు, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రూ.5 వేలు, ఉప్పల వెంకటేష్ రూ.3 వేలు, ఏమిరెడ్డి జైపాల్‌రెడ్డి రూ.4 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జమీల్ మృతి కుటుంబానికి తీరనిలోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని కోరుతూ, కష్టకాలంలో కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.మృతుడు షేక్ జమీల్‌కు భార్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.మాజీ సర్పంచ్‌లు ఏర్పుల జంగయ్య ,ఎపి జంగయ్య,మాజీ ఎంపిటిసి సభ్యులు కల్లు జ్యోతి రాజశేకర్‌రెడ్డి,లాలయ్యగౌడ్,బ్రాహ్మణపల్లి సర్పంచ్ కోరుకోరు తిర్పతయ్య గ్రామస్తులు, బంధువులు జమీల్ మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

# జిల్లాలో నెల రోజుల పాటు పోషణ్ మాస కార్యక్రమాలు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 9, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో నెల రోజుల పాటు పోషణ్ మాస కార్యక్రమాలు జరుగనున్నట్లు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. ఈ నెల 9నుంచి అక్టోబరు 8వ తేదీ వరకు పోషణ్ మాస కార్యక్రమాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రజల్లో పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై విస్తృతంగా అవగాహన కల్పించే ఉద్దేశంతో నెల రోజుల పాటు పోషణ్ మాస కార్యక్రమాలు జరుగనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 793అంగన్‌వాడి కేంద్రాల పరిధిలో అవగాహన కార్యక్రమాలు, సామాజిక భాగస్వామ్య కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. గర్బిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు, మహిళల ఆరోగ్యం పోషణపై ప్రత్యేక దృష్టి సారించటం జరుగుతుందన్నారు. రక్తహీనత నివారణ, ఎత్తు, బరువు, వృద్ధి ప్రమాణాలను పర్యవేక్షించటం, తల్లులకు అవగాహన కల్పించటం, ర్యాలీలు, పోషకాహార ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. పోషకాహారం-ఆరోగ్యం-ఆరోగ్యకరమైన భవిషత్ అనే సందేశాన్ని ప్రతి కుటుంబానికి చేరవేసే విధంగా సంబంధిత శాఖల సమన్వయంతో పోషణ్ మాస కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సంబంధిత శాఖల జిల్లా అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాలో నెల రోజుల పాటు పోషణ్ మాస కార్యక్రమాల పోస్టర్‌ను ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి,పాల్గొన్న అధికారుల దృశ్యం


మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ వీరప్ప

## అక్రమణకు గురైన గ్రామ కంఠం భూమిని సర్వే చేయాలి

**పెద్దేముల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో అక్రమణకు గురైన గ్రామకంఠం భూమిని సర్వే చేయాలని మాజీ సర్పంచ్ వీరప్ప ఆరోపించారు. ఈ మేరకు బుదవారం పెద్దేముల్ మండల తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్‌కు గ్రామస్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్బంగా వీరప్ప మాట్లాడుతూ గ్రామంలోని హనుమాన్ మందిర్ వెనుకాల గల గ్రామకంఠం భూమి సుమారు 10 గుంటల భూమిని గ్రామానికి చెందిన లాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి ఇద్దరూ కలిసి కబ్జాచేసుకున్నారని అన్నారు. గ్రామకంఠం భూమిని సర్వే చేయించి, అట్టి భూమిని వారినుంచి విడిపించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం మంజూరైన ఎస్‌హెచ్‌జి బిల్డింగ్‌ను కావాలని శిఖం భూమిలో కట్ట డానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. శిఖం భూమిలో కాకుండా గ్రామకంఠం భూమిలో ఎస్‌ఎచ్‌జి బిల్డింగ్‌ను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఉపసర్పంచ్ ఎల్లప్ప, వార్డు మెంబర్లు అనిల్, మంగలి భీమయ్య, నాయకులు సాయిలుగౌడ్, ముస్తఫా, అన్నసారం వెంకటయ్య, పాష, ఖయ్యుం, రఘుచారీ, వెంకటయ్య గౌడ్, మహేష్, డి,శ్రీను, కె.వెంకటయ్య, అంజి, వెంకట్‌సాయి, పి.శివకుమార్, వీరేందర్ తదితరులు ఉన్నారు.

## కోల్డ్ చైన్ అన్‌బ్రోకెన్ 9వ ఎడిషన్ ప్రారంభం

**శంషాబాద్ సెప్టెంబరు9,ప్రభాతవార్త :**

ఔషధాలు, త్వరగా పాడయ్యే ఉత్పత్తుల రవాణాలో ఉష్ణోగ్రత నియంత్రిత సరఫరా వ్యవస్థలను మరింత బలోపేతం చేయడమే లక్ష ్యంగా కోల్డ్ చైన్ అన్‌బ్రోకెన్ (సిసియూబి) 9వ ఎడిషన్ ప్రారంభమైంది. నోవోటెల్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో జరుగుతున్న ఈ రెండు రోజుల సదస్సును బుధవారం రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.తెలంగాణ ప్రభుత్వ జీవశాస్త్రాలు ఔషధరంగంలో హైదరాబాద్‌కు పెరుగుతున్న అంతర్జాతీయ ప్రాధాన్యతను వివ రించారు. ఉష్ణోగ్రత సున్నితమైన ఉత్పత్తుల రవాణాకు అవసరమైన మౌలిక వసతులు, సాంకేతికత, ప్రభుత్వ విధానపరమైన సహ కారాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.ఆకాశ, సముద్ర, భూ మార్గాల ద్వారా ప్రపంచ బహుళ రవాణా అనుసంధానం అనే ప్రధాన అంశంతో నిర్వ హిస్తున్న సిసియూబి-2026లో 400 మందికి పైగా పరిశ్రమ ప్రముఖులు పాల్గొన్నారు. ఔషధ తయారీ సంస్థలు, విమానయాన, నౌకాయాన, సరుకు రవాణా, విమానా శ్రయాలు, సాంకేతిక సంస్థలు, లాజిస్టిక్స్ రంగ నిపు ణులు, విధాన రూపకర్తలు ఇందులో భాగస్వాములయ్యారు .ఔషధా లు, పాడయ్యే ఉత్పత్తుల నాణ్యతను ఉత్పత్తి కేంద్రం నుంచి తుది గమ్యస్థానం వరకు కాపాడేలా సమీకృత, విశ్వసనీయమైన కోల్డ్ చైన్ వ్యవస్థల నిర్మాణంపై సదస్సులో చర్చలు జరుగుతున్నాయి.కోల్డ్ చైన్ అన్‌బ్రోకెన్ అధ్యక్షుడు, బోర్డు సలహాదారు సతీష్ లక్కరాజు మాట్లాడుతూ.. ప్రపంచ సరఫరా గొలుసుల్లో ఆకాశ, సముద్ర, భూ రవాణా మార్గాల మధ్య సమ న్వయం అత్యంతకీలకమన్నారు. పరిశ్రమ, ప్రభుత్వం, సాంకేతిక సంస్థలను ఒకే వేదికపైకి తీసుకురావడమే సిసియూబి లక్ష ్యమన్నారు. జీహెచ్‌ఐఎఎల్ సీఈఓ కధీర్ కధీరవన్ మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రపంచస్థాయి జీవ శాస్త్రాలు ,ఔషధ కేంద్రంగా ఎదుగుతోందని తెలిపారు. అంతర్జాతీయ విమాన అనుసంధానం, ఆధునిక కార్గో మౌలిక వసతులతో ఉష్ణోగ్రత సున్నితమైన సరుకు రవాణాకు హైదరాబాద్ విమానాశ్రయం కీలకంగా నిలుస్తోందన్నారు.భారత్-యూరప్-మధ్యప్రాచ్యం-ఆఫ్రికా వాణిజ్య మార్గాల బలోపేతం,విమానాశ్రయాలు-ఓడరేవులు- సిఎస్‌ఎఫ్‌లు- ఐసిడిల అను సంధానం, ఔషధ సరఫరా గొలుసు భద్రత, సముద్ర మార్గం లో కోల్డ్ చైన్ విస్తరణ, వేగవంతమైన వాణిజ్య సేవలు, పర్యావరణ అను కూల సాంకేతికత వంటి అంశాలపై సదస్సులో చర్చలు కొనసాగాయి. సదస్సు ముగింపులో కోల్డ్ చైన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ద్వారా ఉష్ణోగ్రత నియంత్రిత సరుకు రవాణా రంగంలో అత్యుత్తమ నాయకత్వం, నూతన ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణ, సాంకేతికపురోగతి సాధించిన సంస్థలు, వ్యక్తులను సత్కరించ నున్నారు.


సదస్సు ప్రారంభిస్తున్న రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ప్రభుత్వం లైఫ్ సైన్సెస్ విభాగం డైరెక్టర్ సీఈఓ సర్వేశ్ సింగ్,ఇతర ప్రతినిధులు

## ఏయూలో ఉత్సహాభరితంగా క్యాప్చర్ ది ఫ్లాగ్ పోటీల నిర్వహణ

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** అనురాగ్ యూనివర్సిటీలో ఏఐఎంఎల్ విభాగపు ఆధ్వర్యంలో క్యాప్చర్ ది ఫ్లాగ్ పోటీలు ఉత్సహభరితంగా జరిగాయి. ఏయూలోని ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సీఎస్ఐ ప్రొఫెషనల్ చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం ఫోటోలు నిర్వహించగా 200 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. సిఎస్ఐ ఎస్‌బి సిటిఎఫ్ బృందం రూపొం దించి నిర్వహించిన ఏడుసాంకేతిక సవాళ్లు విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం, తార్కిక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం ఏఐఎంఎల్ పరిజ్ఞానాన్ని వెలికితీశాయి. ఈ కార్యక్రమంలో ఎఐఎంఎల్ హెడ్ మల్లిఖార్జున్‌రెడ్డి, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డా. టి. నీత, జి. శ్రీధర్ రెడ్డి, సీఎస్ఐఎస్‌బీ సీటీఎఫ్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో వ్యక్తి అదృశ్యం

**ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** ఓ వ్యక్తి అదృశ్యం అయిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసుల కథనం ప్రకారం పోచారం డివిజన్ అన్నోజిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో నివాసం ఉండే కొక్కళ్ల కృష్ణ ( 62 ), కిరాణా షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కూతుళ్లు, భార్య ఉంది.

తన చిన్న కూతురు సంగీతకు ఆరు నెలల క్రితం కామారెడ్డికి చెందిన పందిరి శ్రీకాంత్‌తో వివాహం జరిగింది. కూతురు భర్తతో విభేదాల కారణంగా అమ్మగారింట్లోనే ఉంటుంది. దీంతో తండ్రి కృష్ణ నిత్యం విచారం వ్యక్తం చేస్తూ అల్లుడి వద్దకు కామారెడ్డికి వెళ్లి మాట్లాడి వస్తాను అంటుండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 7 వ తేదిన రాత్రి సమయంలో కిరాణా షాపు మూసివేసి షాపు తాళంచెవి ఇంటివద్ద గల భార్య శ్రీలక్ష్మీకి ఇచ్చి అల్లుడు వద్దకు వెళ్లి మాట్లాడి వస్తాయని చెప్పగా భార్య వద్దయని చెప్పగా బయటకు వెళ్లి ఇప్పుడే వస్తాను అని కృష్ణా ఇంట్లో నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. కనిపించకుండా పోయిన భర్త కొరకు బంధుమిత్రులు, చుట్టూప్రక్కల వెతకగా ఎక్కడ ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించి తన భర్తను వెతికిపెట్టమని ఫిర్యాదు చేసింది. దీంతో బాధితురాలి నుండి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోచారం ఐటీ కారిడార్ పోలీసులు తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఐదుగురికి జైలుశిక్ష

**మేడ్చల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :**

మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు చేసిన డ్రంక్ ఢ్ర డ్రైవ్ కేసులను బుధవారం 7వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ట్రాఫిక్ పోలీసులు హాజరు పరిచారు. 14 కేసులను విచారించిన అనంతరం న్యాయస్థానం ఐదుగురికి జైలు శిక్ష విధించింది. అందులో ఒకరికి ఐదురోజులు, మరొకరికి నాలుగురోజులు, ఇద్దరికి మూడురోజులు, ఇంకొకరికి రెండురోజుల జైలుశిక్ష ఖరారు చేసింది.

## ఫైలేరియా వ్యాధి నిర్ధారణ వైద్యశిబిరం

**కొడంగల్,సెప్టెంబరు 9,ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఉడిమేశ్వరం గ్రామంలో బుధవారం ఫైలేరియా వ్యాధి పరీక్షలకు సంభందించి వైదన్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్బంగా అంగడిరైచూర్ పిహెచ్‌సీ వైద్యులు బుస్రాఫాతిమా మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి సుధాకర్‌లాల్ ఆదేశాల మేరకు గ్రామంలో పరిశుభ్రత వాతావరణం ఏర్పాటు చేసుకోవాలని దోమలు పుట్టకుండా పుట్టిన దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఫైలేరియా పింఛన్‌కు అర్హులైన వారికి మెడికల్ ధృవపత్రాలు అందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి రమేస్, పకీరప్ప,మనిమాల,మధుసుదన్‌రెడ్డి,ఆవా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశాల అరెస్టులు అప్రజాస్వామికం

**కొత్తూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**

ఆశాల సమస్యలను పరిష్కరించకుండా, తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌కు తరలివెళ్తున్న ఆశా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం కొత్తూరు మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు నిరసన చేపట్టారు. వీరికి మద్దతుగా సీఐటీయూ జిల్లా నాయకులు బీసీ సాయిబాబు పాల్గొన్నారు ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన అనంతరం ఆశా కార్యకర్తలకు కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు కనీస వేతనం రూ.18 వేలు అందిస్తామని హామీలు ఇచ్చారని, అయితే ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా ఆ హామీల అమలుకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.తమ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా కార్యకర్తలను అరెస్టు చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన అన్నారు. ప్రజా ఆరోగ్య వ్యవస్థలో కీలకంగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.అలాగే షాద్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అసెంబ్లీలో ఆశా కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ఆశాలకు న్యాయం జరిగేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో దశలవారీగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని బీసీ సాయిబాబు హెచ్చరించారు.ఆశా కార్యకర్తలపై పెట్టిన కేసులు, అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వారు నినాదాలు చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు ఇందిర, నవనీత, లక్షీ ్మ, జాంగిర్‌బీ, రాజేశ్వరి, బుజ్జి, మాధవి, కమల, లత తదితరులు పాల్గొన్నారు.


కొత్తూరులో నిరసన తెలుపుతున్న ఆశావర్కర్లు

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

**షాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని షాబాద్ సర్పంచ్ అశోక్ కోరారు. బుధవారం షాబాద్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వ యూనిఫారాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రజలు, దాతలు ముందుకు రావాలని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులను విశ్రాంత ఉపాధ్యాయుడు లింగప్ప సన్మానించారు. పాఠశాలకు గేటు, ప్రహరీ ఏర్పాటు చేసేందుకు సహకరించిన దాతలు గడ్డం చంద్రయ్య, మధుసూదన్ గౌడ్‌లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయమ్మ సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ రామకృష్ణ, గ్రామస్థులు అష్మత్ పాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భిన్నత్వంలో ఏకత్వాన్ని కొనసాగించడానికే ఏకరూప దుస్తులు

**షాబాద్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** మాన్‌మర్రి ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రభుత్వం ఉచితంగా విద్యార్థులకు అందిస్తున్న ఏకరూప దుస్తులు, బెల్టులు, మరియు సాక్సులు గ్రామ సర్పంచ్ లాలాపేట బందయ్య,ఉప సర్పంచ్ బేగరి శంకరయ్య, ప్రధానోపాధ్యాయులు మర్పల్లి అశోక్ చేతులమీదుగా విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా ప్రతిరోజు పాఠశాలకు వచ్చేటపుడు యూనిఫామ్ వేసుకొని బెల్ట్, ధరించి షూ సాక్స్ వేసుకొని చక్కగా తయారయ్యి శుభ్రంగా పాఠశాలకు హాజరు కావాలని తెలపడం జరిగింది. విద్యార్థులు శుభ్రంగా ఉన్నట్లయితే మేదస్సు చురుకుగా పని చేస్తుందని,ఉపాధ్యాయులు బోధించే విషయాలు సులభంగా అర్థమవుతాయని ,తద్వారా అవి ఎక్కువ కాలం గుర్తుండే అవకాశం ఉంటుందని వారు విద్యార్థులకు తెలపడం జరిగింది. సెప్టెంబర్ మాసంలో ఫార్మేటివ్ అసెస్మెంట్ రెండు పరీక్షలు ఉన్నందున విద్యార్థులందరూ చక్కగా చదువుకొని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని తెలపడం జరిగింది. పాఠశాలల్లో విద్యార్థులందరూ ఒకే రకం దుస్తుల్లో పాఠశాలకు రావడం వల్ల భిన్నత్వంలో ఏకత్వాన్ని కొనసాగించినట్లు అవుతుందని వారు గుర్తు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మర్పల్లి అశోక్,గ్రామ సర్పంచ్ లాలాపేట బందయ్య,ఉప సర్పంచ్ బేగరి శంకరయ్య, మాజీ సర్పంచ్ సత్యనారాయణ,వార్డు సభ్యులు కవిత వెంకటేష్,దండు నరసింహులు, గొండ్ల వెంకటేష్, బి శంకర్, ఉపాధ్యాయులు వెంకటమ్మ,శ్రీలత,గ్రామస్తులు వెంకటేశ్వరి, అనురాధ, చంద్రకళ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## అలియాబాద్‌లో బతుకమ్మ ఘాట్ నిర్మాణంకు భూమి పూజ

**శామీర్‌పేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

అలియాబాద్‌లో బతుకమ్మ ఘాట్ నిర్మాణంకు ఆ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. బుధవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ కేంద్రంలో బతుకమ్మ ఘాట్ నిర్మాణంకు మున్సిపల్ సాదారణ నిధులు రూ.10లక్షలతో నిర్మించటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ (భూమి పూజ) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మాట్లాడుతూ రానున్న బతుకమ్మ పండుగ కోసం మహిళలకు సౌకర్యంగా ఉండటానికి బతుకమ్మ ఘాట్ నిర్మాణం పనులు చేపడు తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆమె ఆదేశించారు. మహిళలకు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించటానికి చర్యలు తీసుకుంటామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు వైస్‌చైర్మన్ కె. మాలతిమాధవరెడ్డి, కౌన్సిలర్లు గాదె వెంకటేశ, గూదె వెంకటేశ, నాయకులు వి.శ్యామ్, వి.దినేశ్, ఎల్లయ్య, ఎఇఇ సనాషాహిన్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, సిబ్బంది,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


అలియాబాద్‌లో బతుకమ్మ ఘాట్ నిర్మాణంకు శంకుస్థాపన చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న వైస్‌చైర్మన్.కమిషనర్,కౌన్సిలర్లు, అధికారుల, నాయకుల దృశ్యం

## రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలి

**- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి**

**రంగారెడ్డి అర్బన్ , సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** రైతులు రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని క్రమంగా తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచించారు. పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే రైతులకు మెరుగైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. రైతులు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో, ఆత్మ సౌజన్యంతో కొంగరకలాన్‌లోని ఐడీఓసీలో బుధవారం జిల్లా స్థాయి కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు పంటల వైవిధ్యీకరణ, ప్రత్యామ్నాయ పంటలు, సుస్థిర వ్యవసాయం, నేల ఆరోగ్య పరిరక్షణ, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, వ్యవసాయ అనుబంధ శాఖల ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.కిసాన్ మేళాకు ముఖ్య అతిథిగా హాజరైన కోదండరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయంలో పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రసాయనిక మందుల వినియోగం వల్ల నేల సారం దెబ్బతినే అవకాశం ఉన్నందున రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పంటల సాగు చేపట్టడం ద్వారా భవిష్యత్‌లోనూ మంచి దిగుబడులు పొందవచ్చన్నారు. రంగారెడ్డి జిల్లాలోని వాతావరణ, భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వరి సాగును తగ్గించి కూరగాయలు, ఇతర ప్రత్యా మ్నాయ పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలని కోదండరెడ్డి సూచించారు. కార్యక్రమంలో కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలక మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మార్కెట్ కమిటీ ద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోహెడ మార్కెట్‌ను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి రైతులకు మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు.అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ ప్రతి రైతు నేల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పంట సాగుకు ముందు నేల పరీక్షలు చేయించుకుని, నేల స్వభావానికి అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖతో పాటు ఉద్యానవన, పశుసంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ తదితర శాఖలు అమలు చేస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.జిల్లా వ్యవసాయ అధికారి సుజాత జిల్లాలో వ్యవసాయ రంగంలో సాధించిన ప్రగతి, రైతులకు అందుతున్న సేవలు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను వివరించారు.


.కిసాన్ మేళా ప్రారంభిస్తున్న రైత్తు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి


మట్టిని పరిక్షను చేస్తున్న విద్యార్థులుతో చైర్మెన్ బృందం

## నిర్ణీత గడవులోపు డాక్యుమెంట్ అందజేయాలి

**తలకొండపల్లి సెప్టెంబరు 9 ,ప్రభాతవార్త:**ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో భాగంగా ఓటు కోల్పోయిన వారు నిర్ణీత గడువు లోపల తగిన డాక్యుమెంట్ బిఎల్ఓ లకు అందజేయాలని వట్టెలా నిర్మల శ్రీశైలం యాదవ్ అన్నారు. బుధవారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బి ఎల్ ఓ లకు కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏదేని డాక్యుమెంటుతో అందజేసి తమ ఓటు హక్కును కోల్పోకుండా చూసుకోవాలన్నారు. ఓటు నమోదులో చిన్న చిన్న తప్పు లున్న సరిచేసుకోవాలని ఆమె సూచించారు.అనంతరం గ్రామస్తు లకు స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ , ఉప సర్పంచ్ ఆంజనేయులు, అధికారులు రమేష్ శ్రావణ్ కుమార్, శ్రీకాంత్, శ్రీశైలం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబిబిఎస్ సీటు సాధించిన విద్యార్థి కి ఘన సన్మానం

**తలకొండపల్లి, సెప్టెంబరు 9 ,ప్రభాతవార్త:**తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పెరుమాళ్ళ హర్షిత అనే విద్యార్థి ఎంబిబిఎస్ లో సీట్ సాధించడం పట్ల బుధవారం నాడు బిజెపి నాయకులు బుధవారం నాడు బిజెపి నాయకులు ఘన శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన హర్షిత ఎంబి బిఎస్ సీట్ సాధించడం పలువురికి ఆదర్శనీయమని, పలువురికి ఆదర్శ నీయమని వారు భవిష్యత్తులో మరింత ఉత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని వారు కొనియాడారు. బిజెపి నాయకులు సానుమని పాండు ప్రసాద్ రవి గౌడ్ తిరుమల రాజు బాలకృష్ణ శ్రీను సిద్దయ్య ప్రసాద్ రాజు ఉన్నారు.


సన్మానిస్తున్న నాయకులు

## కుమ్మరిగూడలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**కొత్తూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:**

పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష ్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని కొత్తూరు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు జే. సుదర్శన్ గౌడ్ అన్నారు.కొత్తూరు పట్టణంలోని కుమ్మరిగూడలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరై నిర్మాణం పూర్తిచేసుకున్న నూతన ఇంటి గృహప్రవేశ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ అధ్యక్షుడు జే. సుదర్శన్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ మునిసిపల్ ఉపాధ్యక్షుడు బండారి భరత్ గౌడ్ తో కలిసి హాజరై గృహ యజమానిని అభినందించారు. ఈ సందర్భంగా సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. సొంత ఇల్లు లభించడం ప్రతి కుటుంబానికి జీవితంలో మరపురాని అనుభూతి అని, కొత్త ఇంటిలో ఆ కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఆనందంగా జీవించాలని ఆకాంక్షి ంచారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం పట్ల గృహ యజమాని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వన్నాడ శివ శంకర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సింగిల్ విండో డైరెక్టర్ కుమ్మరి లక్ష ్మయ్య, పాశం కృష్ణ, చిలకమర్రి నర్సింలు, పీర్లగూడెం నరసింహా గౌడ్, కుమ్మరి వెంకటయ్య, బండారు లింగం గౌడ్, కుమ్మరి సురేష్, అక్కివేణి కూడా రాజు. తీగాపూర్ ఆంజనేయులు, చిలకమరి రాజు, కే శివకుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు


గృహప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు

## స్పీకర్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి సంఘీభావం

**ఆమనగల్లు, సెప్టెంబరు9, ప్రభాతవార్త:** రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను బుధవారం కల్వ కుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి మర్యాద పూర్వకం గా కలుసుకున్నారు. స్పీకర్ ఛాంబర్‌లో మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో కలుసుకుని సంఘీభావం వ్యక్తం చేశారు. స్పీకర్‌పట్ల బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతామధు చేసిన వ్యాఖ్య లు దురదృష్టకరమైనవని, అత్యంత హేయమైనవిగా కసరెడ్డి అభివర్ణించారు. మనో వేదనకు గురైన స్పీకర్‌ను పరా మర్శించినట్లు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలి పారు. అసెంబ్లీ సమావేశాల సందర్బంగా బిఆర్ఎస్ వ్యవహరి స్తున్న తీరును తెలంగాణ ప్రజానీకం క్షుణ్ణంగా పరిశీలిస్తుం దని, అప్రజాస్వామికం, అనైతికంగా బిఆర్ఎస్ వ్యవహ రిస్తుందని దుయ్యబట్టారు.


స్పీకర్ గడ్డంప్రసాద్, మంత్రి శ్రీధర్‌బాబుతో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## మయూర కంపెనీ ఉద్యోగుల వినూత్న నిరసన

**మేడ్చల్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని మయూర కంపెనీ ఉద్యోగులనిరసన తీవ్రరూపం దాల్చింది. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కంపెనీ ఎదుట ఉద్యోగులు 24 రోజులుగా ధర్నా చేపట్టి ఆందోళన కొనసాగిస్తున్నారు. ఇన్ని రోజులైన యాజమాన్యం వైపు నుంచి సమస్యల పరిష్కారంపై స్పష్టమైన స్పందన లేకపోవడంతో విసిగి పోయిన ఉద్యోగులు కంపెనీ ముందుర ఉన్న 44వ జాతీయ రహదారిపై అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు.

## నాగారం డివిజన్‌కు 500 వీధి దీపాల విరాళం

**కీసర,సెప్టెంబరు9,ప్రభాతవార్త:**

ఘట్‌కేసర సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలోని ప్రజల భద్రత,సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి 500 వీధి దీపాలను విరాళంగా బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డిని కలిసి 500 వీధి దీపాలను డివిజన్ ప్రాంతాలలో అవసరమైన చోట ఏర్పాటు చేయాలని కోరుతూ లేఖను అందజేశారు.ఈ లేఖపై డిప్యూటీ కమిషనర్ సంతకం చేశారు.వీధి దీపాలు లేని ప్రాంతాలు, ప్రస్తుతం పనిచేయని లైట్లు ఉన్న ప్రాంతాలను గుర్తించి ,ప్రజలకు రాత్రివేళల్లో మెరుగైన వెలుతురు మరియు భద్రత కల్పించేలా వీటిని ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలసాని భూమయ్య యాదవ్,నాయకులు శ్రీశైలం ,బాల నర్సింహ్మ,ప్రవీణ్ రాజు,వంశీ తదితరులు పాల్గొన్నారు.

## మునగ సాగు ద్వారా మహిళా రైతులకు అధిక ఆదాయం

**శామీర్‌పేట, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:**

మునగ సాగుద్వారా మహిళారైతులకు అధిక ఆదాయం లభిస్తుందని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాములవి అన్నారు. బుధవారం మూడుచింతలపల్లి మండలకేంద్రంలోని రైతు వేదికలో మహిళలకు మునగ మొక్కలను పంపిణీ చేశారు.

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో డిఆర్‌డిఏ-మెప్మా పరిధి లోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళా రైతులకు మునగ మొక్కల పంపిణీని నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ జాములవి మాట్లాడుతూ మహిళలు మునగసాగు చేయటంద్వారా వచ్చే ఆదాయాలతో వారికుటుంబాలు ఆర్థికపరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు.

మునగలో అధిక పోషకవిలువలు ఉండటంతో ఆరోగ్యానికి మంచిదని, మహిళా రైతులను మునగసాగు కోసం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. మునగకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని అన్నారు. పచ్చని ప్రకృతి-.ఆరోగ్యమైన జీవితం-మహిళల ఆర్థిక బలం అనే లక్ష్యంతో మహిళా రైతులను మునగ సాగు వైపున ప్రోత్సహిస్తున్నట్లు సంబంధిత శాఖల అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ సాంబశివరావు, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి,హార్టికల్చర్ అధికారులు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.


మూడుచింతలపల్లి మండల కేంద్రంలో రైతువేదికలో మహిళలను మునగ మొక్కలను పంపిణీ చేసి మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న జిల్లా అధికారులు, మహిళల, తదితరుల దృశ్యం

## అవయవదానంపై విద్యార్థులకు అవగాహన

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 9, ప్రభాతవార్త:** అవయవదానం వల్ల పునర్జీవించవచ్చని తెలంగాణ రాష్ట్ర శరీర అవయవ దాతల సంఘం మేడ్చల్ జిల్లా కో-కన్వీనర్ ఆర్.సద్గుణాచారీ అన్నారు. ఘట్‌కేసర్‌లోని రిషి జూనియర్ కళాశాలలో అవయవదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర సంఘం సభ్యులు కేజీయా, క్రిష్ణవేణిలు మాట్లాడుతూ మనిషి బ్రతికి ఉన్నప్పుడు రక్తం, చర్మం, వెంట్రుకలు, ఒక కిడ్నీ, పావు భాగం కాలేయాన్ని ఇతరులకు దానం చేయవచ్చని తెలిపారు. బ్రెయిన్‌డెడ్ (జీవన్మృతుడు) అయిన వ్యక్తి నుంచి గుండె, కిడ్నీలు, ఊపిరితిత్తులు, పాంక్రియాస్, కార్నియా, కాలేయం తదితర భాగాలతో ఇతరులకు దానం చేసి 11 మందికి ప్రాణదానం చేయవచ్చని, మృతశరీరాన్ని వైద్య కళాశాలకు దానం చేయవచ్చని వారు వివరించారు.